మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU — దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 23-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 204 Issue: 204

Published from Jagitial
www.evarthalu.com


23 జనవరి 2026 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:53 సూర్యాస్తమయం - సా. 6:02 తిథి పంచమి రా. 1:44వ వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం పూర్వాభాద్ర మ. 2:21 వరకు తరువాత ఉత్తరాభాద్ర యోగం పరిఘ మ. 3:50 వరకు కరణం బవ మ. 2:07 వరకు భాలవ రా. 1:44వ వరకు వర్జ్యం రా. 12:01 నుండి రా. 1:36 వరకు దుర్ముహూర్తం ఉ. 9:07 నుండి ఉ. 9:51 వరకు మ. 12:50 నుండి మ. 1:34 వరకు రాహుకాలం ఉ. 11:04 నుండి మ. 12:28 వరకు యమగండం మ. 3:15 నుండి సా. 4:39 వరకు గుళికాకాలం ఉ. 8:16 నుండి ఉ. 9:40 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:17 నుండి ఉ. 6:05 వరకు అమృత ఘడియలు ఉ. 6:59 నుండి ఉ. 8:35 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:05 నుండి మ. 12:50 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

# దావోస్.. షో-ఆఫ్!




## భారీ ఎంవోయూలు.. తక్కువ పెట్టుబడులు

### స్టేటస్ కోసం ఫొటో షూట్లు.. పబ్లిసిటీ స్టంట్లు

### ఒక్కో రాష్ట్రానికి రూ. కోట్ల ప్రజా ధనం వృథా

### పెదవి విరుస్తున్న వ్యాపార రంగ నిపుణులు



### వాస్తవ రూపం వేరు

ఆ మధ్య వైజాగ్‌లో భారీ స్థాయిలో పెట్టుబడుల సదస్సు నిర్వహించారు. లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు వస్తున్నాయని ప్రచారం చేశారు. ఒకవేళ ఆ ఎంవోయూలు నిజంగా సక్సెస్ అయి ఉంటే ఆంధ్రప్రదేశ్‌కు రూ.20 లక్షల కోట్లు వచ్చి ఉండాల్సింది. కానీ వాస్తవ రూపంలో కనీసం రూ.10 వేల కోట్లు కూడా రాలేదు. ఆ సదస్సులో ఎంవోయూలపై సంతకాలు చేసేందుకు మనుషులు దొరకక.. స్టార్ హోటళ్లలో పనిచేసే వంట మనుషులతో సంతకాలు చేయించారని నాకు తెలిసింది. గ్రాఫిక్స్ , బిల్డప్‌లతో పెట్టుబడులు రావు. వాస్తవ పరిస్థితులు వేరు.

– బీఆరస్ అధినేత కేసీఆర్

### అది ఇండియా ఎకనామిక్ ఫోరం!



దావోస్ పర్యటన నేరపూరిత రీతిలో ప్రజాధానాన్ని వృథా చేయడమే. భారతీయులు వేల కిలోమీటర్ల దూరం వెళ్లి అక్కడా భారతీయులనే కలుస్తూ, దేశీయ కంపెనీలతోనే ఒప్పందాలు చేసుకోవడం విడ్డూరంగా ఉంది. ఇలాంటివి భారత్‌లోనే తక్కువ ఖర్చుతోనే పూర్తి చేసుకోవచ్చు. దావోస్ వేదికగా విదేశీ కంపెనీలతో పెట్టుబడి ఒప్పందాలు చేసుకుంటే అది దేశానికి ప్రయోజనకరం. కానీ ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే, వరల్డ్ ఎకనామిక్ ఫోరం.. ఇండియా ఎకనామిక్ ఫోరంలా కనిపిస్తోంది. ఏడుగురు ముఖ్యమంత్రులు అక్కడికి వెళ్లి కేవలం షో-ఆఫ్ కోసమే ఇవన్నీ చేస్తున్నారు. ఇది ఒక స్టేటస్ సింబల్‌గా మారింది.

- ఎంపీ రాజీవ్ శుక్లా




(ఈవార్తలు- స్పెషల్ డెస్క్)

ప్రతి సంవత్సరం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సు జరుగుతుంది. ఈ సదస్సుకు ప్రపంచ దేశాల నుంచి వ్యాపార దిగ్గజాలు వస్తుంటారు. తమ పెట్టుబడుల గురించి, వ్యాపార కార్యకలాపాల విస్తరణ గురించి వివరించి.. ఆహ్వానించే దేశాలతో ఎంవోయూలు చేసుకుంటారు. ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా దావోస్ సదస్సు జరిగింది. తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబునాయుడు అక్కడికి వెళ్లి పలు తరువాయి 2 వ పేజీలో...



స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ మంత్రి నారా లోకేశ్

# 12 మీటింగులు

## పారిశ్రామిక దిగ్గజాలతో సీఎం రేవంత్ భేటీలు

### విజయవంతంగా ముగిసిన దావోస్ పర్యటన

### రైజింగ్ 2047 లక్ష్యానికి ఊతంలా సదస్సు: ప్రభుత్వం

### అట్నుంచే అమెరికా పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి

### స్వదేశానికి మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి

'తెలంగాణ రైజింగ్' ప్రతినిధుల బృందం స్విట్జర్లాండ్?లోని దావోస్ పర్యటన విజయవంతంగా ముగిసిందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. గత నెలలో హైదరాబాద్ లో జరిగిన గ్లోబల్ సమ్మిట్?లో రాష్ట్ర ప్రభుత్వం భారీగా రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించగా, తాజాగా జరిగిన మూడు రోజుల వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులోనూ తెలంగాణ ఆశించిన లక్ష్యాన్ని సాధించిందని వెల్లడించింది.


హైదరాబాద్, జనవరి 22 (ఈవార్తలు): వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ 2026 సదస్సులో పెట్టుబడులకు మించి తెలంగాణ రైజింగ్ 2047 విజన్ లక్ష్యాలను ప్రపంచానికి చాటి చెప్పాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరిందని వివరించింది. 'మూడు రోజుల పాటు జరిగిన ఈ పర్యటనలో ప్రతినిధుల బృందం గ్లోబల్ కేపబిలిటీ తరువాయి 2 వ పేజీలో...

భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, ఒలింపిక్ పతకాల విజేత పూసర్ల వెంకట సింధు చరిత్ర సృష్టించింది. కెరీర్ లో 500 మ్యాచుల్లో విజయాలు సొంతం చేసుకుంది. ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా సింధు రికార్డు సృష్టించింది.

### బంగారం- వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము- 24 క్యారెట్స్): | రూ.15,431 |
| వెండి (గ్రాము): | రూ.340 |
| ప్లాటినం (గ్రాము): | రూ.7,174 |

### విశ్వవాణి



మీకు తెలుసా..? కొబ్బరికాయ సముద్రంలో నీళ్లపై లక్షల మైళ్లు ప్రయాణించినా కుళ్లిపోవడం, మొలకెత్తడం గానీ జరగదు. ఆ తర్వాత అది భూమిపైకి చేరితే మొలకెత్తగల సామర్థ్యం దాని సొంతం. జీవశాస్త్రంలో ఈ ప్రక్రియను 'హైడ్రోకోరీ' అని అంటారు.

# హలో.. కేటీఆర్ రండి!

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు

నేడు ఉదయం 11 గంటలకు రావాలని ఆదేశం.. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణ

ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో మరో కీలక మలుపు చోటుచేసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. శుక్రవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని ఆ నోటీసుల్లో ఆదేశించింది.

హైదరాబాద్, జనవరి 22 (ఈవార్తలు): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్న ఆరోపణలపై సిట్ అధికారులు 2024 మార్చి నుంచి దర్యాప్తు జరుపుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో కొందరిపై ప్రధాన అభియోగపత్రం దాఖలు చేయగా, విచారణను మరింత లోతుగా కొనసాగిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా రెండు రోజుల క్రితం మాజీ మంత్రి హరీశ్ రావును అధికారులు సుమారు 7 గంటల పాటు విచారించారు. ఆ విచారణ అనంతరం రెండు రోజులకే కేటీఆర్‌కు నోటీసులు రావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



# కార్తీక దీపం సీరియల్

### ఫోన్ ట్యాపింగ్ కేసు కాలయాపనే

### 'సిట్' అంటే సిట్.. స్టాండ్: కేటీఆర్

ఫోన్ ట్యాపింగ్ కేసును కార్తీక దీపం సీరియల్‌లా కాలయాపన చేయడం తప్ప, ఆ కేసులో ఏం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం ఆయన సిరిసిల్లలో మీడియాతో మాట్లాడారు. హామీల అమలును తప్పించుకోవడానికే రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు.

సిరిసిల్ల, జనవరి 22 (ఈవార్తలు): సిట్ అనేది రేవంత్ రెడ్డి సిట్ అంటే కూర్చుంటది.. స్టాండ్ అంటే నిల్చుంటదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం పేరుతో కొన్ని రోజులు డ్రామా.. ఈ కార్ రేసు కొన్నిరోజులు, గొర్రెల స్కామ్ అంటూ కొన్ని రోజులు, ఇప్పుడు -2 వ పేజీలో...




## ఎయిరిండియాకు 15,000 కోట్లు నష్టం

దెబ్బకొట్టిన అహ్మదాబాద్ ప్రమాదం ఎఫెక్ట్ 2




## ఇండిగో లాభంలో 78 శాతం మైనస్

డిసెంబర్‌లో భారీ దెబ్బ.. 1900 కోట్లు లాస్ 2

## విజయ్‌కు విజిల్ కమల్‌కు టార్చిలైట్

ఎన్నికల గుర్తులు కేటాయింపు 2

## 10 మంది సైనికులు మృతి

లోయలో పడ్డ ఆర్మీ వెహికల్

9 మందికి తీవ్ర గాయాలు

## ఏడుగురు సజీవ దహనం

స్టీల్ ప్లాంట్‌లో పేలుడు

రాయ్‌పూర్‌లో ఘటన 2

## 15 మంది నక్సల్స్ హతం

జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్ 2

# నైనీ టెండర్ నోటిఫికేషన్ రద్దు

### పాలనాపరమైన కారణాల వల్లే : సింగరేణి

ఒడిశాలోని నైనీ బొగ్గు గని టెండర్ల నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్లు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సీసీఎల్) తాజాగా ప్రకటించింది. పాలనాపరమైన కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. నైనీ కోల్ మైన్స్ టెండర్ల విషయంలో ఇటీవల తీవ్ర ఆరోపణలు రావడంతో ఉప ముఖ్యమంత్రి, గనుల శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పందించి టెండర్లు రద్దు చేస్తున్నట్లు ఇటీవల ప్రకటించారు.



హైదరాబాద్, జనవరి 22 (ఈవార్తలు): షెడ్యూల్ ప్రకారం.. గురువారం సాయంత్రం 5 గంటల నుంచి బిడ్డింగ్ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా, టెండర్ రద్దు చేస్తున్నట్లు ఎస్సీసీఎల్ ప్రకటించింది. మరోవైపు, నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల విషయంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ సింగరేణి పాలకమండలిని ప్రశ్నించింది. టెండర్ల విషయంలో అవినీతి ఆరోపణలు ఎందుకు వస్తున్నాయని, సైట్ విజిట్ ధృవీకరణ పత్రాలు ఎందుకు ఇవ్వడం లేదని సంయుక్త కార్యదర్శి సంజయ్ కుమార్ నిలదీశారు. టెండర్ల ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని, తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

23.1.2026

మేషం: వ్యయప్రయాసలతో కొన్ని పనులు పూర్తి అవుతాయి. ధనవ్యయ సూచనలు ఉన్నవి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో చికాకులు మరింత పెరుగుతాయి. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ప్రయాణాలు చివరి నిమిషంలో వాయిదా పడతాయి.

వృషభం: నూతన వస్తులాభాలు ఉంటాయి. ఆకస్మిక ధనలబ్ధి కలుగుతుంది. దూరపు బంధువుల నుండి విలువైన సమాచారం అందుతుంది. వృత్తి ఉద్యోగాలలో మీ పనితీరు అందరినీ ఆకట్టుకుంటారు. ఇంటా బయట ఆశ్చర్యకర సంఘటనలు చోటుచేసుకుంటాయి. వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి.

మిధునం: విద్యార్థుల అంచనాలు అందుకుంటారు. సమాజంలో పరపతి పెరుగుతుంది. ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితులు, సహాయ సహకారాలు అందుతాయి. నూతన వాహనయోగం ఉన్నది. దైవదర్శనాలు చేసుకుంటారు. వ్యాపారాలు, ఉద్యోగాలు సజావుగా సాగుతాయి.

కర్కాటకం: వ్యాపార వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చేసి నష్టాలు ఎదుర్కొంటారు. బంధువులతో మాటపట్టింపులు కలుగుతాయి. చేపట్టిన పనులలో శ్రమ తప్పదు. గృహమున కొందరి ప్రవర్తన శిరో బాధ కలిగిస్తుంది. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. వ్యాపారాలు, ఉద్యోగాలు నత్తనడకన సాగుతాయి.

సింహం: ఎంత శ్రమపడిన పనులు ముందుకు సాగవు. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. ముఖ్యమైన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. మానసిక సమస్యలు బాధిస్తాయి. మిత్రులతో చిన్నపాటి విభేదాలు ఉంటాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారుల నుంచి ఒత్తిడి అధికమవుతుంది.

కన్య: నూతన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. వ్యాపార వ్యవహారాలలో ఆకస్మికంగా నిర్ణయాలు మార్చుకుంటారు. స్థిరాస్తి క్రయ విక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. ఉద్యోగమున మీ విలువ మరింత పెరుగుతుంది.

తుల: ఆరోగ్యం మందగిస్తుంది. ధన పరమైన చికాకులు పెరుగుతాయి. గృహ వాతావరణం చికాకుగా ఉంటుంది. మిత్రులతో ఊహించని మాటపట్టింపులు కలుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు కలుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు నిదానంగా సాగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

వృశ్చికం: నూతన వాహనం కొనుగోలు చేస్తారు. నిరుద్యోగుల చిరకాల స్వప్నం నెరవేరుతుంది. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. ఆప్తుల నుంచి శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలు అభివృద్ధి బాటలో పయనిస్తాయి. ఉద్యోగాలలో అధికారులతో చర్చలు సఫలం అవుతాయి.

ధనస్సు: ఇంటా బయట శ్రమాధిక్యత పెరుగుతుంది. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. మిత్రుల నుంచి ఋణ ఒత్తిడులు పెరుగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు తప్పవు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాల విస్తరణ ప్రయత్నాలు మందగిస్తాయి. ఉద్యోగాలలో ఒడిదుడుకులు పెరుగుతాయి.

మకరం: చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దైవ సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. దైవచింతన పెరుగుతుంది. ఆకస్మిక ధన ప్రాప్తి కలుగుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో ఉన్నతి కలుగుతుంది.

కుంభం: చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. విలువైన వస్త్ర ఆభరణలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. వాహన అనుకూలత కలుగుతుంది. అధికారులతో చర్చలు సఫలం అవుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు మరింత అనుకూలంగా సాగుతాయి.

మీనం: ఆర్థిక ఇబ్బందులు అధికమౌతాయి. ఇంటా బయట పరిస్థితులు అనుకూలించవు. ముఖ్యమైన వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ కలిగిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో శ్రమ తప్పదు. ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ వహించాలి. వ్యాపారాలలో నూతన పెట్టుబడులు పెట్టకపోవడం మంచిది.




# కార్తీక దీపం సీరియల్

**మొదటి పేజీ తరువాయి**

ఫోన్ ట్యాపింగ్ అంటూ కొన్ని రోజులు డ్రామా చేసి వదిలేస్తారు.. ఇందులో ఏం లేదు అని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. సింగరేణి కుంభకోణాన్ని బయటపెట్టినందుకే హరీశ్ రావుకు, తనకు నోటీసులు ఇచ్చారని అన్నారు. ట్యాపింగ్ అనేది దేశ భద్రత కోసం, ప్రజల భద్రత కోసం, ప్రభుత్వాన్ని అస్థిర పర్చాలనే కుట్రలు ఎవరైనా చేస్తే దాని నుంచి ప్రభుత్వాలను కాపాడటం కోసం 1952(నెహ్రూ కాలం) నుంచి నేటి వరకు నిఘా వ్యవస్థలు చేస్తాయని అన్నారు. అది నేరమేం కాదని అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ప్రభుత్వాలకు సంబంధం ఉండదు.. పోలీసు వ్యవస్థ కనుసన్నల్లోనే జరుగుతుందని అన్నారు. ప్రభుత్వానికి కావాల్సిన సమాచారాన్ని తీసుకొచ్చే క్రమంలో పోలీసులు ట్యాపింగ్ చేస్తారని అన్నారు. ఇది పూర్తిగా ట్రాష్ కేసు.. ఇందులో ఏం ఉండదని కొట్టిపారేశారు. అసలు ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందు విచారించాల్సింది ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డినే అని అన్నారు. ఆయనను వదిలేసి మమ్మల్ని పిలిస్తే ఏం వస్తదని ప్రశ్నించారు. ఇప్పుడు ప్రతిపక్షాల ఫోన్‌లను రేవంత్ రెడ్డి కూడా ట్యాపింగ్ చేయిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రేపు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తాము విచారణ జరిపిస్తే వీళ్లంతా కూడా జైలుకు పోతారని అన్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు ఇద్దరూ తమ ఫోన్‌లు ట్యాపింగ్‌కు గురవుతున్నాయని అన్నారని, మరి వారి వ్యాఖ్యలపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తనకు నోటీసులు అందాయని, విచారణకు వెళ్తానని స్పష్టం చేశారు.

# ఎయిరిండియాకు 15,000 కోట్లు నష్టం

## దెబ్బకొట్టిన అహ్మదాబాద్ ప్రమాదం ఎఫెక్ట్

న్యూఢిల్లీ: టాటా గ్రూప్ – సింగపూర్ ఎయిర్‌లైన్స్‌ల జాయింట్ వెంచర్ అయిన ఎయిర్ ఇండియాకు గత సంవత్సరం ఒక పీడకలగా మారింది. సంవత్సరాల నష్టాల నుంచి కోలుకుని లాభాల బాట పట్టడానికి సిద్ధం అవుతున్న క్రమంలో ఈ విమానయాన సంస్థ ఇప్పుడు దాని చరిత్రలో అత్యంత దారుణమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అహ్మదాబాద్‌లో జరిగిన విషాద విమాన ప్రమాదం వందలాది మంది ప్రాణాలను బలిగొనడమే కాకుండా కంపెనీ ఆర్థిక వెన్నెముకను కూడా బద్దలు కొట్టింది. పలు నివేదికల ప్రకారం.. మార్చి 31తో ముగిసే ఆర్థిక సంవత్సరానికి ఎయిర్ ఇండియా రూ.15,000 వేల కోట్ల భారీ నష్టాన్ని నివేదించనుంది. జూన్‌కు ముందు ఎయిర్ ఇండియా తన గత ఇబ్బందులను పక్కనపెట్టి తిరిగి గాడిలో పడింది. ఈ ఆర్థిక సంవత్సరానికి కార్యాచరణ లాభాలు (లాభం లేదు, నష్టం లేదు) సాధించాలని కంపెనీ వ్యవస్థాపకులు లక్ష్యంగా




పెట్టుకున్నారు. కానీ జూన్ లో జరిగిన డ్రీమ్‌లైనర్ ప్రమాదం అన్నింటినీ తారుమారు చేసింది. ఆ ఘోర ప్రమాదంలో 240 మందికి పైగా ప్రాణాలను కోల్పోయారు. నిజానికి ఇది ఎయిర్‌లైన్ వృద్ధికి ఎండ్ కార్డ్ పలికింది. సమస్య అక్కడితో సమసిపోలేదు. భారతదేశంతో సైనిక ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ తన వైమానిక ప్రాంతాన్ని భారత విమానాలకు మూసివేయడానికి దారితీసింది. ఇది ఎయిర్ ఇండియా ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపింది. యూరప్ – అమెరికాకు విమానాలు ఇప్పుడు ఎక్కువ దూరంలో ప్రయాణించాల్సి వస్తుంది. దీని ఫలితంగా ఇంధనం, నిర్వహణ ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఈ రెండు సంఘటనలు ఎయిర్ ఇండియా లాభాలపై ఉన్న ఆశలను దెబ్బతీశాయి. గత మూడు సంవత్సరాలలో కంపెనీ మొత్తం రూ.32,210 కోట్ల నష్టాన్ని చవిచూసింది.

# ఇండిగో లాభంలో 78 శాతం మైనస్

## డిసెంబర్‌లో భారీ దెబ్బ.. 1900 కోట్లు లాస్

న్యూఢిల్లీ: ఇండిగో మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ గురువారం త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ రూ.549.1 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2448.8 కోట్ల లాభంతో పోలిస్తే 78 శాతం క్షీణత నమోదైంది. కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు, గతేడాది డిసెంబర్‌లో తలెత్తిన విమాన సేవల్లో అంతరాయం వంటివి లాభాలపై ప్రభావం చూపాయి. కొత్త కార్మిక చట్టాల అమలుకు రూ.969 కోట్లు, కార్యకలాపాల అంతరాయాల కారణంగా రూ.577 కోట్లు ఖర్చయినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. మొత్తంగా ఈ త్రైమాసికంలో రూ.1,546 కోట్లు ప్రభావం పడినట్లు పేర్కొంది. కరెన్సీ లావాదేవీలకు సంబంధించి డాలర్ ఆధారిత భవిష్యత్ చెల్లింపుల కోసం మరో రూ.1,035 కోట్లను డిసెంబర్ త్రైమాసికంలో మినహాయించినట్లు ఇండిగో పేర్కొంది. మొత్తం ఆదాయం రూ.24,540.6 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.22,992.8 కోట్లతో పోలిస్తే కాస్త పెరిగింది. గత డిసెంబర్‌లో వందలాది విమాన సర్వీసులను ఇండిగో రద్దు చేసింది. దీంతో వేల మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో టికెట్ మొత్తాలను కంపెనీ రిఫండ్ చేసింది. ప్రయాణికులకు పరిహారం చెల్లించడంతో పాటు, గుడ్‌వెల్ గెశ్చర్ ఓచర్ల కింద ఒక్కో ప్రయాణికుడికి రూ.10 వేలు చొప్పున చెల్లిస్తామని హామీ ఇచ్చింది. అదీకాక, డీజీసీఏ రూ.22 కోట్ల జరిమానా విధించడంతో పాటు రూ.50 కోట్లు బ్యాంక్ గ్యారెంటీ చెల్లించాలని ఆదేశించింది. ఫిబ్రవరి 10 వరకు వింటర్ షెడ్యూల్‌లో 10 శాతం కోత పెట్టింది. ఈ ప్రభావం తాజా త్రైమాసిక ఫలితాల్లో కనిపించింది. రాబోయే త్రైమాసికంలోనూ ఈ ప్రభావం పడే అవకాశం ఉంది.

# 10 మంది సైనికులు మృతి

## లోయలో పడ్డ ఆర్మీ వెహికల్.. 9 మందికి తీవ్ర గాయాలు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఆర్మీ వాహనం లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 10 మంది జవాన్లు మరణించగా, మరో 9 మంది గాయపడ్డారు. బందేర్వా–చంబా హైవేపై ఉన్న ఖన్ని టాప్ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. బుల్లెట్ ప్రూఫ్ ఆర్మీ వాహనంలో సుమారు 17 మంది సిబ్బంది ప్రయాణిస్తున్నారు. ఆర్మీ వాహనం హై ఆల్టిట్యూడ్ పోస్టు వద్దకు వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేకపోయారు. సుమారు 200 ఫీట్ల లోతులో ఆ వెహికిల్ పడిపోయింది. ఆర్మీతో పాటు పోలీసులు సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టారు. నలుగురు సైనికులు మృతిచెందినట్లు గుర్తించామన్నారు. గాయపడ్డవారిలో కొందర్ని ఉదంపూర్ మిలిటరీ ఆస్పత్రిలో చేర్పించారు.

# ఏడుగురు సజీవ దహనం

రాయ్‌పూర్: స్టీల్ ప్లాంట్‌లో పేలుడు సంభవించింది. బొగ్గు కొలిమి అకస్మాత్తుగా పేలింది. ఈ ప్రమాదంలో ఏడుగురు కార్మికులు సజీవ దహనమయ్యారు. మరి కొందరు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బలోడా బజార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గురువారం ఉదయం బకులాహిలోని రియల్ ఇస్పాట్ స్టీల్ ప్లాంట్‌లో దుర్ఘటన జరిగింది. బొగ్గు కొలిమి ప్రాంతం చుట్టూ కొంతమంది కార్మికులు శుభ్రపరిచే పనులు చేస్తుండగా అది పేలింది. మంటలు, దట్టంగా పొగలు చాలా దూరం వరకు కనిపించాయి. పోలీసులు పేలుడుపై దర్యాప్తు చేస్తున్నారు.

# 15 మంది నక్సల్స్ హతం

**జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్**

రాంచీ: జార్ఖండ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. సింగ్‌భూం జిల్లాలో భద్రతా దళాలు జరిపిన ఆపరేషన్‌లో 15 మంది మావోయిస్టులు హతమయ్యారు. సారండా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, సింగ్‌భూం జిల్లాలోని సారండా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో పోలీసులు, సీఆర్పీఎఫ్ కోబ్రా బలగాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా దళాలపై మావోయిస్టులు కాల్పులకు తెగబడటంతో, బలగాలు దీటుగా ప్రతిఘటించాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో కూంబింగ్ కొనసాగుతోంది. 2026 మార్చి నాటికి దేశాన్ని మావోయిస్ట్ రహితంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సహా మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో భద్రతా బలగాలు నిర్మూలన చర్యలను ముమ్మరం చేశాయి. జార్ఖండ్‌లో జరిగిన ఈ తాజా ఎన్‌కౌంటర్‌ను కూడా ఈ ఆపరేషన్లలో భాగంగానే అధికారులు చూస్తున్నారు.

# దావోస్.. షో-ఆఫ్!

**మొదటి పేజీ తరువాయి**

కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. ఇక్కడిదాకా అంతా బాగానే ఉంది. మరి.. ఈ దావోస్ సదస్సు అనుకున్న ఫలితాలను ఇస్తుందా జరిగిన అన్ని ఎంవోయూలు పెట్టుబడులుగా మారుతాయా రూ.వేల కోట్ల ప్రకటనలు కాగితాలకే పరిమితం అవుతాయా లేక క్షేత్రస్థాయిలో నిలబడతాయా అన్న అనేక ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. తాజాగా, రాజ్యసభ సభ్యుడు రాజీవ్ శుక్లా చేసిన 'షో–ఆఫ్' కామెంట్లతో ఒక్కసారిగా ఈ సదస్సు ఉపయోగంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా విదేశాలకు వెళ్లి స్వదేశీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకోవడంపై ఆయన పెదవి విరిచారు. ఇదేదో భారత్‌లోనే ఒప్పందాలు చేసుకుంటే బాగుండేదని, రూ.కోట్ల ప్రజాధనం వృథా అయ్యేది కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

### ఏది నిజం

దావోస్ వంటి సదస్సుల్లో రూ.వేల కోట్ల ఒప్పందాలు జరిగినట్లు ప్రకటించినా, అవి క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలుకావు. ఎంవోయూలు ప్రాథమిక దశలోనే ఉంటాయి. వాస్తవానికి, దావోస్‌లో జరిగేవి అవగాహన ఒప్పందాలు మాత్రమే. ఇవి పెట్టుబడి పెట్టడానికి ఒక ఆసక్తిని మాత్రమే తెలియజేస్తాయి తప్ప, కచ్చితంగా పెట్టుబడి పెడతామనే గ్యారెంటీని ఇవ్వవు. అదీకాక.. రాష్ట్రాల్లో భూసేకరణ, అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల వల్ల చాలా ప్రాజెక్టులు మధ్యలోనే ఆగిపోతుంటాయి. కాకపోతే, ప్రపంచం నలుమూలల నుండి వచ్చే పెట్టుబడిదారులను ఒకే చోట కలిసే అవకాశం దావోస్‌లో మాత్రమే ఉంటుందని, నెట్‌వర్కింగ్ కోసం ఇది ఒక గొప్ప వేదిక అని ప్రభుత్వాలు పేర్కొంటున్నాయి.

### దావోస్ సదస్సుపై విమర్శలు ఇవీ..

- ఏటా రాష్ట్ర ప్రభుత్వాలు దావోస్‌లో రూ.లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు జరిగాయని ప్రకటిస్తాయి. కానీ, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వాటిలో 10% నుండి 20% కూడా వాస్తవ రూపం దాల్చవు. ఈ నెంబర్ల గేమ్ కేవలం ప్రజలను నమ్మించడానికి చేసే ఒక షో అని విమర్శలు ఉన్నాయి.
- ప్రపంచ స్థాయి నేతలు, దిగ్గజ కంపెనీల సీఈఓలతో ఫోటోలు దిగి సోషల్ మీడియాలో పెట్టడానికే నాయకులు ప్రాధాన్యం ఇస్తున్నారని, తద్వారా తాము గ్లోబల్ లీడర్లుగా కనిపిస్తామని నేతలు భావిస్తున్నారన్న అపవాదు ఉంది.
- ఒక రాష్ట్రం నుండి సీఎం, మంత్రులు, ఐఏఎస్ అధికారులు, వారి సిబ్బంది కలిపి భారీ బృందంగా వెళ్లడం వల్ల రూ.కోట్ల ప్రజా ధనం ఖర్చవుతుంది. ఆ ఖర్చుకు తగ్గ ఫలితం రావడం లేదన్నది రాజీవ్ శుక్లా లాంటి వారి అభిప్రాయం.
- చాలా ప్రభుత్వాలు తమను తాము బిజినెస్ ఫ్రెండ్లీగా చూపించుకోవడానికి ఈ భారీ ఒప్పందాలను పబ్లిక్ రిలేషన్స్ స్టంట్స్ ఉపయోగిస్తున్నాయన్న ఆరోపణ ఉంది.

# విజయ్‌కు విజిల్.. కమల్‌కు టార్చిలైట్

**ఎన్నికల గుర్తులు కేటాయింపు**

చెన్నై: తమిళనాడులో 2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే), కమల్ హాసన్ నాయకత్వంలోని మక్కల్ నీది మయ్యం (ఎంఎనం) పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) గుర్తులను కేటాయించింది. విజయ్ పార్టీకి విజిల్ గుర్తు లభించగా, కమల్ పార్టీకి బ్యాటరీ టార్చ్ గుర్తును ఖరారు చేశారు. తొలిసారి అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగుతున్న విజయ్ పార్టీ టీవీకేకు ఇది ఒక కీలకమైన ముందడుగు. రాష్ట్రవ్యాప్తంగా తమ అభ్యర్థులందరికీ ఒకే గుర్తు ఉండాలని పార్టీ చేసిన అభ్యర్థనను ఈసీఐ ఆమోదించింది. అవినీతి, అక్రమ పాలనపై గళం విప్పేందుకు, ప్రజలను చైతన్యపరిచేందుకు విజిల్ గుర్తు తమ విధానాలకు ప్రతీకగా నిలుస్తుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. విజయ్ రాజకీయ ప్రవేశంతో ఇప్పటికే యువతలో ఉన్న ఆసక్తిని ఓట్లుగా మలుచుకోవడంలో ఈ గుర్తు కీలకం కానుంది. మరోవైపు, కమల్ హాసన్ పార్టీ ఎంఎనంకు బ్యాటరీ టార్చ్ గుర్తును కొనసాగిస్తూ ఈసీ నిర్ణయం తీసుకుంది. 2021 ఎన్నికల్లో కూడా ఇదే గుర్తుతో పోటీ చేసినందున, ఓటర్లకు సులభంగా గుర్తుండేందుకు, పార్టీ గుర్తింపును కొనసాగించేందుకు తమకు పాత గుర్తునే కేటాయించాలని ఎంఎనం కోరింది. గత ఎన్నికల్లో ఒక్క సీటు గెలవకపోయినా, టార్చ్ లైట్ గుర్తుతో తమ మద్దతును పటిష్ఠం చేసుకోవాలని కమల్ పార్టీ భావిస్తోంది.




# 12 మీటింగులు

**మొదటి పేజీ తరువాయి**

సెంటర్లు, డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించింది. ఏఐ, సస్టైనబిలిటీ, స్కిల్లింగ్ కార్యక్రమాలకు సంబంధించిన పలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించిన రెండు కీలక సెషన్లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగం, హైదరాబాద్ లో వరల్డ్ ఎకనమిక్ ఫాలో అప్ ఫోరమ్ నిర్వహించాలనే ప్రతిపాదనకు సానుకూల స్పందన లభించింది. మూడు రోజుల్లో ప్రపంచ స్థాయి ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక దిగ్గజాలతో 12 ముఖాముఖీ సమావేశాల్లో సీఎం పాల్గొన్నారు. పలు కీలక సమావేశాలు, ప్రత్యేక సెషన్ల అనంతరం మూడు రోజుల తెలంగాణ ప్రతినిధి బృందం దావోస్ పర్యటన గురువారం సాయంత్రం ముగిసింది' అని పేర్కొంది. కాగా, దావోస్ పర్యటన ముగించుకొన్న సీఎం రేవంత్ అటు నుంచి జూరిచ్ బయల్దేరారు.

# ధాన్యం కొనుగోళ్లలో మాది రికార్డు




**25 సంవత్సరాలలో ఇదే అత్యధికం**

**కొనుగోళ్లతో 14.20 లక్షల రైతులకు లబ్ధి**

**మొత్తం 18,532.98 కోట్ల చెల్లింపు**

**అగ్రస్థానంలో నిజామాబాద్, నల్లగొండ**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**

హైదరాబాద్, జనవరి 22 (ఈవార్తలు): తెలంగాణా రాష్ట్రం ధాన్యం దిగుబడిలోనే కాకుండా ఖరీఫ్ సీజన్ లో కొనుగోలు చెందిన ధాన్యం దేశచరిత్రలోనే ఆల్ టైం రికార్డ్ నమోదు చేసుకుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గడిచిన 25 సంవత్సరాల వ్యవధిలో ఇదే అత్యధిక రికార్డ్ అని చెప్పారు. 2025-26 రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకై పౌర సరఫరా శాఖా రూపొందించిన ప్రణాలికలపై గురువారం రోజున బేగంపేట ఐ.ఏ.ఎస్.ఆఫీసర్స్ అసోసియేషన్ బిల్డింగ్ లో జరిగిన సమీక్ష సమావేశానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల వ్యవదిలో అనుసరించిన విధానాల ఫలితమే ధాన్యం దిగుబడి, కొనుగోలులోనూ సంచలనాత్మక రికార్డ్ నమోదు చేసుకుందని చెప్పారు. పౌరసరఫరాల శాఖ, నీటిపారుదల, వ్యవసాయ శాఖలు పరస్పరం సమన్వయం చేసుకోవడంతో పాటు తెలంగాణా రైతాంగం భాగస్వామ్యంతోటే ఇంతటి విజయం సాధించామని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల చరిత్రలోనే రికార్డ్ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన ఘనత తెలంగాణా రాష్ట్రానికి దక్కిందన్నారు. దేశ చరిత్రలోనే ఇంత పెద్ద స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన దాఖలాలు దేశంలోని మరే ఇతర రాష్ట్రాలలో లేవని తెలిపారు. 2020-21 లో నమోదు అయిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు రికార్డ్ ను అధిగమించి తాజాగా జరిగిన ఖరీఫ్ సీజన్ లో71.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి దేశ చరిత్రలోనే కొత్త అధ్యాయం సృష్టించిందన్నారు. మద్దతు ధర తో పాటు సన్నాలకు మొట్టమొదటి సారిగా తెలంగాణా ప్రభుత్వం అందిస్తున్న బోనస్‌తో కలిపి మొత్తం 18,532.98 కోట్ల రూపాయలను 14.20 లక్షల మంది రైతులకు చెల్లించామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికా బద్దంగా రూపొందించిన మేరకు అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 8,548 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో పాటు కొనుగోలు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో రైతులు ఎక్కడ ఇబ్బంది పడకుండా కొనుగోలు ప్రక్రియ ముగిసిందని వివరించారు. అందుకు పౌర సరఫరాల శాఖ సిబ్బంది పని తీరును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. అధిక దిగుబడులతో పాటు రికార్డ్ స్థాయిలో కొనుగోలు చెసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి భారత ఆహార సంస్థతో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థ కు సరఫరా చేయడంతో పాటు తెలంగాణా బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్ లో ఉన్న డిమాండ్ ను పట్టి విదేశాలకు ఎగుమతి చేసేందుకు విధి విధానాలను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉన్న ధాన్యాన్ని పండించేందుకు గాను రైతులను ప్రోత్సహించేందుకు ప్రోత్సాహకాల ఆవశ్యకతను వివరించారు. అంతర్జాతీయ మార్కెట్ కు బియ్యాన్ని ఎగుమతి చెసేందుకు కుడా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి 38,000 కోట్లను నేరుగా రైతుల ఖాతాలో జమ చేయడం కుడా ఒక అరుదైన రికార్డే అని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతాంగం పట్ల అనుసరించిన విధానాలతో సంచలనాత్మక ఫలితాలు సాధించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థలోనూ విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సన్నబియ్యం 3.17 కోట్ల మందికి ఉచితంగా పంపిణీ చేస్తున్నామని,అంటే రాష్ట్ర జనాభాలో 85% లబ్ది పొందుతున్నారని వివరించారు.అర్హులైన ప్రతి లబ్ధిదారుకు నెలకు ఆరు కిలోల బియ్యం ఉచితంగా అందిస్తున్నామన్నారు. సన్నబియ్యం పంపిణీ మీద 13,650 కోట్లు ఖర్చు పెడుతున్నట్టు తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో ఉన్న నాణ్యతా లోపాలు గుర్తించడంతో పాటు అక్రమంగా బ్లాక్ మార్కెట్ కు తరలి పోయే విధానానికి కళ్లెం వేసి నాణ్యతా ప్రమాణాలపై కఠిన నిబంధనలు అమలులోకి తెచ్చామన్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సీజన్ కు సీజన్ కు పెరుగుతున్న నేపధ్యంలో అందుకు అనుగుణంగా నిల్వ చేసేందుకు మౌలిక సదుపాయాల ఆధునీకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ధాన్యాన్ని నిల్వచేసే గోదాముల సామర్థ్యం 29 లక్షల మెట్రిక్ టన్నుల వరకు పరిమితము అయ్యిందని,ఈ గోదాములను భారత ఆహార సంస్థ,రాష్ట్ర గోదాముల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ కొనసాగుతుందని అయితే నాణ్యతా లోపాలతో నిల్వ ఉంచిన బియ్యం చేడి పోయి రాష్ట్ర ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లుతుందని తెలిపారు. కేంద్రప్రభుత్వం సహకారంతో పాటు ప్రవైట్ సంస్థల భాగస్వామ్యం తో ధాన్యం నిలువ ఉంచే గోదాములను సైలో పద్దతిలో ఆధునికరించేందుకు ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఆధునీకీకరణతో తేమ శాతం నియంత్రణలో ఉండడంతో పాటు నష్టానివారణ చర్యలు చేపట్టవచ్చున్నారు. అయితే ప్రారంభంలో ఆధునీకరణకు ఖర్చు ఎక్కువే అయినప్పటికీ నిల్వ చేసిన బియ్యం చెడిపోకుండా ఉంటే అది ప్రయోజనం కలిగిస్తుందన్నారు.

# రేవంత్‌ను వదలం

## స్కాంలను బయటపెడుతూనే ఉంటాం.. మాజీమంత్రి హరీశ్ రావు హెచ్చరిక

హైదరాబాద్,జనవరి 22 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీమంత్రి హరీశ్ రావు విరుచుకుపడ్డారు. తమపై ఎన్నికుట్రలు చేసినా...ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ నాయకులు సింహాల్లా గర్జిస్తూనే ఉంటారు అని చెప్పుకొచ్చారు. నువ్వు ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎంత మంది బీఆర్ఎస్ నాయకులను విచారణ పేరుతో వేధించే ప్రయత్నం చేసినా...ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేసేదాకా నిన్ను, నీ పార్టీని వదిలిపెట్టం అని మాజీమంత్రి హరీశ్ రావు విరుచుకుపడ్డారు. అంతే కాదు మీ కుంభకోణాలను, వాటాల పంచాయతీలను బట్టబయలు చేస్తూనే ఉంటాం అని మాజీమంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. బొగ్గు స్కాంపై సమాధానం చెప్పే దమ్ములేకనే సీఎం రేవంత్ రెడ్డి నోటీసుల డ్రామా ఆడుతున్నారని మాజీమంత్రి హరీశ్ రావు మండిపడ్డారు.పాలనా వైఫల్యం, కాంగ్రెస్ వరుస స్కాంల నుంచి దృష్టి మళ్లించేందుకే సిట్ నోటీసులు అని ఆరోపించారు.సీఎం రేవంత్ రెడ్డి బామ్మర్ది బొగ్గు స్కాం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాజకీయకక్ష సాధింపు చర్యలో భాగమే నిన్న నాకు, నేడు కేటీఆర్‌కు సిట్ నోటీసులు ఇచ్చింది అని మాజీమంత్రి హరీశ్ రావు చెప్పుకొచ్చారు. 'రేవంత్ రెడ్డి గుర్తుపెట్టుకో.. ప్రతీకారం అనేది బలహీనుల ఆయుధం. దమ్మున్న నాయకుడి ఆయుధం ఎప్పుడూ ప్రజాపోరాటమే' అని మాజీమంత్రి హరీశ్ రావు చెప్పుకొచ్చారు.'మీరు బలహీనులు కాబట్టే పోలీసులను ఆయుధాలుగా వాడుకుంటున్నారు.మేం ధైర్యవంతులం కాబట్టే ప్రజల మధ్య నిటారుగా నిలబడి నిన్ను నిలదీస్తున్నాం.మీ నోటీసులకు సమాధానం చెప్పడానికి బీఆరస్ నాయకులం ఎప్పుడూ సిద్ధమే. కానీ రేపు ప్రజా కోర్టులో సమాధానాలు చెప్పడానికి నువ్వు సిద్దంగా ఉండు. నువ్వు ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని కేసులు పెట్టినా బిఆరస్ నాయకులు సింహాల్లా గర్జిస్తూనే ఉంటారు.'అని మాజీమంత్రి హరీశ్ రావు విరుచుకుపడ్డారు.



### ఎన్ని నోటీసులు ఇచ్చినా రేవంత్ రెడ్డిని వదలం

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు ఇవ్వడంపై మాజీమంత్రి హరీశ్ రావు స్పందించారు.'నిన్న నాకు నోటీసులు.. నేడు కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చారు. ఎందుకంటే కేటీఆర్ ఒకవైపు గట్టిగా నిలదీస్తున్నాడు.. ఇంకో వైపు నేను నిలదీస్తున్నాను . అందుకే ప్రజల దృష్టిని మరల్చేందుకు నోటీసుల పేరుతో డ్రామాలు ఆడుతోంది.'అని హరీశ్ రావు ఆరోపించారు.బొగ్గు కుంభకోణంపై సమాధానం చెప్పే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదు అని చెప్పుకొచ్చారు. 'ఎన్ని నోటీసులు ఇచ్చినా బిడ్డా రేవంత్ రెడ్డి... ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేసేదాకా నీ వెంట పడుతూనే ఉంటాం... ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని అటెన్షన్ డైవర్షన్లు చేసినా నిన్ను వదిలి పెట్టం. వెంటపడుతాం' అని హరీశ్ రావు హెచ్చరించారు.

# మేడారం జాతరకు హెలికాప్టర్ సేవలు

**హనుమకొండ నుంచి మేడారానికి,**

**జాతరపై ఏరియల్ వ్యూ రైడ్స్**

**రెండు రకాల సర్వీసులకు**

**వేర్వేరు ధరలు ఖరారు**

హనుమకొండ, జనవరి 22 (ఈవార్తలు): మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు వెళ్లే భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జాతర సమయంలో వేగంగా గమ్యస్థానం చేరుకునేందుకు వీలుగా హెలికాప్టర్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. తెలంగాణ పర్యాటక శాఖ, తుంబి ఎయిర్‌లైన్స్ సంయుక్తంగా అందిస్తున్న ఈ సేవలు గురువారం నుంచి ప్రారంభమ య్యాయి. భక్తుల అవసరాలకు అనుగుణంగా రెండు రకాల ప్యాకేజీలను నిర్వాహకులు ప్రకటించారు. మొదటి ప్యాకేజీలో భాగంగా హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం నుంచి నేరుగా మేడారం వెళ్లి, తిరిగి వచ్చేందుకు అవకాశం కల్పించారు. ఈ రౌండ్ ట్రిప్‌కు ఒక్కో వ్యక్తికి ఛార్జీ రూ. 35,999గా నిర్ణయించారు. అయితే, జనవరి 23లోపు బుక్ చేసుకున్న వారికి రాయితీ అందిస్తుండగా, వారు రూ. 30,999 చెల్లిస్తే సరిపోతుంది. ఇక, రెండో ప్యాకేజీ కింద మేడారం జాతర అందాలను ఆకాశం నుంచి వీక్షించాలనుకునే వారి కోసం 'జాయ్ రైడ్స్' నిర్వహిస్తున్నారు. మేడారం సమీపంలోని పడిగాపూర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి ఈ సర్వీసులు నడుస్తాయి. సుమారు 6 నుంచి 7 నిమిషాల పాటు సాగే ఈ గగన విహారానికి ఒక్కొక్కరికి రూ. 4,800 రుసుముగా వసూలు చేయనున్నారు. ఈ సేవలతో భక్తులు సమయం ఆదా చేసుకోవడంతో పాటు జాతరను విహంగ వీక్షణం చేసే అద్భుత అవకాశం పొందవచ్చు.

# సిరిసిల్ల జిల్లాను ఎత్తేసే కుట్ర: కేటీఆర్

సిరిసిల్ల, జనవరి 22 (ఈవార్తలు): సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండానే ఎగరబోతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికలపై వార్డుల ఇంచార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన కీలక దిశానిర్దేశం చేశారు. మెజారిటీ కాదు.. అన్ని వార్డులు గెలవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. సిరిసిల్ల ఒకప్పుడు ఎలా ఉందో, బీఆర్ఎస్ పాలనలో ఎలా అభివృద్ధి చెందిందో ప్రజలకు స్పష్టంగా వివరించాలని కేటీఆర్ సూచించారు. "మన పని మనమే చెప్పుకోవాలి.. వేరే వాళ్లు చెప్పరు" అంటూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత ఇక స్థానిక ఎన్నికలు లేవని, నేరుగా సాధారణ ఎన్నికలే ఉంటాయని గుర్తుచేస్తూ, ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. జిల్లాల పునర్విభజన పేరుతో గందరగోళం సృష్టిస్తున్నారని, రాజన్న సిరిసిల్ల జిల్లాను ఎత్తివేయాలనే కుట్రలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. ఈ అంశం ప్రజల్లో, న్యాయవాదులు, మేధావుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. రేవంత్ పాలనను తుగ్లక్ తరహా పాలనగా అభివర్ణించారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ షాక్‌లో ఉందని, అందుకే కార్పొరేషన్ ఎన్నికలకు భయపడుతోందని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో 40 శాతానికి పైగా సర్పంచ్ స్థానాలు బీఆర్ఎస్ గెలుచుకుందని గుర్తు చేశారు. సిరిసిల్ల పట్టణం గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌కు దూరంగా ఉందని, బీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత మున్సిపాలిటీపై పూర్తి ఆధిపత్యం సాధించామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎంత బాకీ పెట్టిందో గడపగడపకు తీసుకెళ్లాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతుబంధు, బతుకమ్మ చీరలు, రిటైర్డ్ ఉద్యోగుల పింఛన్లు, నేతన్నల సమస్యలు అన్నింటినీ ప్రజలకు వివరించాలని సూచించారు. నేతన్నలకు నిజమైన అండగా నిలిచింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికలను తానే నేరుగా పర్యవేక్షిస్తానని ప్రకటించిన కేటీఆర్... ప్రజలు ఎప్పుడూ గులాబీ జెండా వైపేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త, ప్రతి వార్డు ఇంచార్జి ఇంటింటి ప్రచారం చేసి, అభివృద్ధిని చెప్పి, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.



# ఆక్రమణలపై హైడ్రా దండోరా!

## గచ్చిబౌలి, శామీర్‌పేటలో ఆక్రమణలపై చర్యలు.. ప్రజావాణి ఫిర్యాదులతో వేగంగా స్పందన

హైదరాబాద్, జనవరి 22 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో ఆక్రమణలపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. ఒకే రోజు రెండు వేర్వేరు ప్రాంతాల్లో చర్యలు చేపట్టింది. గచ్చిబౌలిలో ఓ విలువైన పార్కు స్థలాన్ని కాపాడగా, శామీర్‌పేటలో ఏళ్లుగా మూతపడిన రహదారికి విముక్తి కల్పించింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అధికారులు ఈ చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే, గచ్చిబౌలి టెలికాం నగర్‌లో 1982 నాటి లేఅవుట్‌లో 4000 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. అయితే, కాలక్రమేణా ఇందులో 1500 గజాలు ఆక్రమణకు గురై నిర్మాణాలు వెలిశాయి. మిగిలిన 2500 గజాల స్థలాన్ని కూడా కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో స్థానికులు హైడ్రా ప్రజావాణిని ఆశ్రయించారు. కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. లేఅవుట్ ప్రకారం అది పార్కు స్థలమని నిర్ధారించుకుని, 2500 గజాల స్థలంలోని ఆక్రమణలను తొలగించారు. భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా ఫెన్సింగ్ వేసి, 'పార్క్ స్థలం' అని బోర్డును ఏర్పాటు చేశారు. మరో ఘటనలో, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఫ్రెండ్స్ కాలనీలోనూ హైడ్రా చర్యలు చేపట్టింది. 1987 నాటి లేఅవుట్‌లోని 20 అడుగుల రోడ్డును కొందరు ఆక్రమించి గోడలు, గేటు నిర్మించారు. దీనిపై ప్రజావాణికి ఫిర్యాదు అందడంతో హైడ్రా అధికారులు గురువారం ఆక్రమణలను తొలగించి, రహదారిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. గత 15 ఏళ్లుగా ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, హైడ్రా చొరవతో తమ సమస్య తీరిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.






# గ్రూప్-1 పై తీర్పు వాయిదా

**ఫిబ్రవరి 5న తీర్పు: తెలంగాణ హైకోర్టు**

హైదరాబాద్, జనవరి 22 (ఈవార్తలు): తెలంగాణ గ్రూప్-1 సర్వీసెస్ మెయిన్స్ పరీక్ష ఫలితాలను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లపై హైకోర్టు తన తీర్పును వాయిదా వేసింది. ఈ కేసులో తుది తీర్పును ఫిబ్రవరి 5వ తేదీన వెల్లడించనున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ప్రకటించింది. తీర్పు కాపీ ఇంకా సిద్ధం కాలేదని, అందువల్ల వాయిదా వేస్తున్నట్లు కోర్టు పార్టీలకు తెలియజేసింది. ఈ అప్పీళ్లపై గత డిసెంబర్ 31న వాదనలు ముగించిన ధర్మాసనం, తీర్పును రిజర్వ్ చేసింది. గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకన ప్రక్రియలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని పేర్కొంటూ, సింగిల్ బెంచ్ జడ్జి జస్టిస్ నమవరపు రాజేశ్వర్ రావు సెప్టెంబర్ 9న ఫలితాలు, ర్యాంకుల జాబితాను రద్దు చేశారు. జవాబు పత్రాలను మ్యాన్యువల్‌గా పునఃమూల్యాంకనం చేయాలని లేదా 8 నెలల్లోగా పరీక్షను తిరిగి నిర్వహించాలని టీజీపీఎస్సీని ఆదేశించారు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ తీర్పును తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ , ఎంపికైన కొందరు అభ్యర్థులు డివిజన్ బెంచ్‌లో సవాలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం, సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధించింది. ఫలితాల ఆధారంగా నియామక ప్రక్రియను కొనసాగించడానికి టీజీపీఎస్సీకి అనుమతి ఇచ్చింది. అయితే, ఈ నియామకాలు కోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని అప్పట్లో స్పష్టం చేసింది. ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో, టీజీపీఎస్సీ 563 పోస్టులకు గాను 562 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. 2024 అక్టోబర్ 21 నుంచి 27 వరకు జరిగిన ఈ మెయిన్స్ పరీక్షలకు దాదాపు 30,000 మంది హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

# బీసీ.. సీఎం అవుతారు

**టీపీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు**

హైదరాబాద్, జనవరి 22 (ఈవార్తలు): కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం బీసీలకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ నేత ముఖ్యమంత్రి అయ్యే ఆ సమయం తప్పకుండా వస్తుందని అన్నారు. మున్ముందు బీసీలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని, అవకాశం ఉన్న ప్రతి చోట బీసీలకు పదవులు ఇస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు. కష్టపడి పనిచేస్తే ఎవరి వాటా వాళ్లకు దక్కుతుందని, దీనిని ఎవ్వరూ అడ్డుకోలేరని మహేశ్ గౌడ్ అన్నారు. రాబోయే రోజులు అన్నీ బీసీలవే అని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతోందన్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యలకు ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేయడం దేశానికి మంచిది కాదని, కులం, మతం పేరుతో మన పిల్లలకు భవిష్యత్తు రాదని వ్యాఖ్యానించారు. రాముడు, అంజనేయుడి పేర్లు చెప్పి బీజేపీ నేతలు ఓట్లు దండుకుంటున్నారని విమర్శించారు. అర్వింద్ 'జై శ్రీరాం' అని కాకుండా, పార్లమెంట్ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లి తాను చేసిన అభివృద్ధి ఏంటో చెప్పి ఓట్లు అడగాలని హితవు పలికారు. రాముని పేరు చెప్పడం తప్ప నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏం చేశారో వివరించాలన్నారు. దేవుళ్లను రాజకీయాలతో ముడిపెట్టవద్దని మహేశ్ కుమార్ స్పష్టం చేశారు.

# 3లోగా గద్దర్ అవార్డులకు దరఖాస్తు

హైదరాబాద్, జనవరి 22 (ఈవార్తలు): 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ పొందిన చిత్రాలకు తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్- 2025 ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ తెలిపింది. ఫీచర్ ఫిలిమ్స్, జాతీయ సమైక్యతపై ఫీచర్ ఫిలిమ్స్, పర్యావరణం, హెరిటేజ్, చరిత్ర, సామాజిక చైతన్యం, బాలల చిత్రాలు, చలన చిత్ర రంగంలో టెక్నీషియన్లు, డాక్యుమెంటరీ, షార్ట్ ఫిలిమ్స్,సినిమా రంగంపై బుక్స్ తదితర రంగాలలో ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్టు ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు ఉన్న అవార్డు విభాగాలకు తోడు ఈసారి కొత్త విభాగాలను కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. 'ఉత్తమ సామాజిక సందేశ చిత్రం' అవార్డు, ప్రత్యేక విభాగంలో డాక్టర్ సీ నారాయణరెడ్డి అవార్డులను అందజేస్తామన్నారు. అర్హులైన నిర్మాతలు, ఇతర దరఖాస్తుదారులు ఫిబ్రవరి 3లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు https://filmin.telangana.gov.inను సందర్శించాలని పేర్కొన్నారు.



## ధన్వంతరి ఆలయంలో ఘనంగా
# రథసప్తమి ప్రారంభం

జగిత్యాల టౌన్, జనవరి 22 (ఈవార్తలు): జగిత్యాలలోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో రథసప్తమి సూర్య జన్మోత్సవం ఘనంగా ప్రారంభమైంది. గురువారం ఉదయం 5.15 గంటలకు సుప్రభాతసేవ, ధ్రువమూర్తులకు అభిషేకాలు చేస్తూ తొలి రోజు ప్రారంభమైంది. అనంతరం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహ వచనం, రక్షా బంధనం, పంచగవ్య ప్రాశనం, పల్లకి సేవా, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ అండ్ చైర్మెన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, మేనేజింగ్ ట్రస్ట్ గట్టు రాజేందర్, అధ్యక్షుడు ముత్యాల రామలింగారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్లగట్ట శంకర్, కోశాధికారి వడ్లగట్ట స్వాతి, సహాయ కోశాధికారి వడ్లగట్ట గోపి, ధర్మకర్తలు వొడ్నాల లత, భారతాల గీత, తిరుపతి, అర్చకులు ప్రణయ్ కుమార్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



## విశాఖ రైల్వేస్టేషన్‌లో
# రోబో పోలీస్

వైజాగ్, జనవరి 22 (ఈవార్తలు): భారతీయ రైల్వే చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. దేశంలోనే తొలిసారిగా విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఏఎస్సీ అర్జున్ అనే హ్యూమనాయిడ్ రోబోను ప్రవేశపెట్టారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే ఆధ్వర్యంలోని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఈ వినూత్న కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించింది. రైల్వే కార్యకలాపాల్లో ఆధునిక టెక్నాలజీని వినియోగించడంలో ఇది ఒక మైలురాయిగా నిలవనుంది. ప్రయాణికుల భద్రత, భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు వారికి మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ రోబోను అందుబాటులోకి తెచ్చినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఏఎస్సీ అర్జున్ రోబో.. ప్రయాణికులకు సహాయం చేయడం, రద్దీని నియంత్రించడం, పరిశుభ్రతను పర్యవేక్షించడం, భద్రతాపరమైన అవగాహన కల్పించడం వంటి పనులను నిర్వర్తిస్తుంది. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌ను ఆధునికీకరించే ప్రయత్నాల్లో భాగంగా ఈ రోబోను ప్రవేశపెట్టారు. ఈ రోబోను పూర్తిగా విశాఖపట్నంలోనే దేశీయంగా డిజైన్ చేసి అభివృద్ధి చేయడం విశేషం. ఏడాదికి పైగా సమయం వెచ్చించి ఈ టెక్నాలజీని రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. ప్రయాణికుల సేవల్లో టెక్నాలజీని అనుసంధానించడంలో ఈ రోబో సేవలు కీలక పాత్ర పోషిస్తాయని ఈస్ట్ కోస్ట్ రైల్వే భావిస్తోంది.

# కోటరీని నమ్మితే అధికారం కల్ల!
## జగన్‌కు విజయసాయిరెడ్డి హెచ్చరిక.. లిక్కర్ స్కాంలో ముగిసినఈడీ విచారణ

విజయవాడ, జనవరి 22 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ ఆరోపణల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరైన వైసీపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి, అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ భవిష్యత్తుపై కీలక ప్రకటన చేయడంతో పాటు, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చుట్టూ ఉన్న కోటరీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారి వల్లే పార్టీకి ఈ దుస్థితి దాపురించిందని, ఆ కోటరీ మాటలు నమ్మితే జగన్ మళ్లీ అధికారంలోకి రావడం అసాధ్యమని తేల్చిచెప్పారు. గత ఏడాది రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన విజయసాయి రెడ్డి, ఆ నిర్ణయంపై యూ-టర్న్ తీసుకున్నారు. తాను రాజకీయాల నుంచి తప్పుకోవడం లేదని, జూన్ తర్వాత తన రాజకీయ భవిష్యత్ ప్రణాళికలను వెల్లడిస్తానని స్పష్టం చేశారు. లిక్కర్ స్కామ్ విచారణలో భాగంగా ఈడీ అధికారులు తనను ప్రశ్నించారని, అయితే అసలు ఏపీలో లిక్కర్ స్కామ్ జరిగిందని తాను భావించడం



లేదని అధికారులకు చెప్పినట్లు వెల్లడించారు. మిథున్ రెడ్డి కోరిక మేరకు శ్రీధర్ రెడ్డి కంపెనీకి సిఫారసు చేసిన మాట వాస్తవమేనని, కానీ రూ.100 కోట్లు ఏర్పాటు చేయాలని జగన్ తనతో ఎన్నడూ చెప్పలేదని ఆయన కుండబద్దలు కొట్టారు. ఈ సందర్భంగా జగన్ చుట్టూ ఉన్న కోటరీపై విజయసాయి రెడ్డి తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేశారు. 'జగన్ చుట్టూ ఉన్న కోటరీ పెట్టే వేధింపులు, అవమానాలు తట్టుకోలేకపోయాను. ఆ కోటరీయే నన్ను పొగబెట్టి నెమ్మదిగా పార్టీ నుంచి బయటకు పంపించింది. కోటరీలోని కొందరు ఇప్పటికీ తింటూనే ఉన్నారు. జగన్ జైలులో ఉన్నప్పుడు పార్టీని అంటిపెట్టుకుని ఉన్న నాకు ఇప్పుడు గౌరవం లేకుండా పోయింది. ఈ కోటరీ మాటలు నమ్మడం కొనసాగిస్తే జగన్ ఎప్పటికీ అధికారంలోకి రాలేరు' అని ఘాటుగా విమర్శించారు. తాను నంబర్ 2 అనే మాట వాస్తవమేనని, కానీ, కేవలం తనపై కేసులు వచ్చినప్పుడు, వాటిని ఎదుర్కోవడానికి మాత్రమే తనను నంబర్ 2గా ప్రచారం చేశారని వాపోయారు. కానీ లాభాలు పంచుకోవడంలో మాత్రం తన స్థానం వంద తర్వాతనే అని అన్నారు. ఇక ప్రలోభాలకు లొంగిపోయారు అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలు తనను తీవ్రంగా బాధించాయని, ఆ వ్యాఖ్యలను జగన్ వెనక్కి తీసుకుంటేనే తదుపరి ఆలోచన ఉంటుందని షరతు విధించారు. టీడీపీ కూటమిని విడగొడితేనే జగన్‌కు మళ్లీ అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషణ చేశారు. తనకు విశాఖలో ఒక అపార్ట్‌మెంట్ తప్ప మరేమీ లేదని, ఏడాదిగా వ్యవసాయం చేసుకుంటున్నానని, సంబంధం లేని విషయాల్లో తనను ఇరికించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విజయసాయి రెడ్డి వ్యాఖ్యలు ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

### బీజేపీలో చేరిక?

రాజకీయాల నుంచి తాను పూర్తిగా తప్పుకోలేదని విజయసాయిరెడ్డి అన్నారు. ఈ నెల 25వ తేదీన నుంచి పాలిటిక్స్‌లోకి రీఎంట్రీ ఇవ్వబోతున్నాను అని సంచలన ప్రకటన చేశారు. బీజేపీ ఆహ్వానిస్తే ఆలోచిస్తానని పరోక్షంగా హింట్ ఇచ్చారు. అంతేకాదు.. మోడీ ఉత్తమ ప్రధాని అని, ప్రపంచ దేశాల ముందు భారత్‌ను గర్వంగా నిలబెడుతున్నారని కొనియాడారు. దేశానికి ఇలాంటి ప్రధాని ఉండటం ప్రజల అదృష్టం అని విజయసాయిరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

## తిరుమలలో రథసప్తమికి
# సర్వం సిద్ధం

తిరుమల, జనవరి 22 (ఈవార్తలు): ఒకే రోజులో జరిగే మినీ బ్రహ్మోత్సవంగా భావించే రథసప్తమి వేడుకలకు తిరుమల క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. జనవరి 25న జరగనున్న ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈసారి సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంది. వేడుకల రోజున అన్ని రకాల ఆర్జిత సేవలు, ప్రివిలేజ్ దర్శనాలు, వీఐపీ బ్రేక్ దర్శనాలను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. రథసప్తమి సందర్భంగా ఒకే రోజులో శ్రీ మలయప్ప స్వామి వారు ఎనిమిది వాహనాలపై మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించనున్నారు. ఉదయం సూర్యప్రభ వాహనంతో సేవలు ప్రారంభమై, రాత్రి చంద్రప్రభ వాహనంతో ముగుస్తాయి. ఈ వేడుకలను వీక్షించేందుకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ పటిష్ఠమైన చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జనవరి 24 నుంచి 26 వరకు తిరుపతిలో స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల జారీని కూడా నిలిపివేశారు. భక్తుల సౌకర్యార్థం 85 కౌంటర్ల ద్వారా 14 రకాల అన్నప్రసాదాలను పంపిణీ చేయనున్నారు. భద్రత కోసం 1300 మంది పోలీసులు, 1200 మంది విజిలెన్స్ సిబ్బందిని మోహరించారు. భక్తుల కోసం ఏపీఎస్ఆర్టీసీ 2300 ప్రత్యేక ట్రిప్పులు నడపనుండగా, మెరుగైన పారిశుద్ధ్య చర్యలు, వైద్య సేవలను అందుబాటులో ఉంచారు. ఈ వేడుకలను 1000 మంది కళాకారులతో 56 రకాల కళారూపాల ప్రదర్శనలతో మరింత శోభాయమానంగా మార్చనున్నారు. ఈ ఉత్సవాలను ఎస్వీబీసీ ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. భక్తులు సంయమనం పాటిస్తూ, టీటీడీ సూచనలను అనుసరించి స్వామివారి వాహన సేవలను వీక్షించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# విశాఖ తీరంలో భారీ తిమింగలం

వైజాగ్, జనవరి 22 (ఈవార్తలు): విశాఖపట్నం సముద్ర తీరంలో ఓ అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. రుషికొండ సమీపంలో స్కూబా డైవింగ్ చేస్తున్న బృందానికి భారీ తిమింగలం (వేల్ షార్క్) కనువిందు చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద చేప జాతిగా భావించే ఈ తిమింగలం, డైవర్లకు అతి సమీపంలోకి రావడంతో వారు ఆ క్షణాలను కెమెరాలో బంధించారు. రుషికొండ తీరానికి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో, 45 అడుగుల లోతులో నలుగురు స్కూబా డైవర్లు అన్వేషణ సాగిస్తుండగా ఈ భారీ భారీ తిమింగలం దర్శనమిచ్చింది. దాదాపు 12 నుంచి 20 మీటర్ల పొడవున్న ఈ భారీ జీవి తమ పక్కనే ఈదుతుండటంతో వారు ఆశ్చర్యపోయారు. చాలా కాలం తర్వాత రుషికొండ తీరంలో ఇలాంటి అరుదైన జీవి కనిపించడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. "స్కూబా డైవర్లు ఇంత దగ్గరగా తిమింగలం సొరను చూడటం విశాఖ తీరంలో ఇదే మొదటిసారి. మేము దానిని సుమారు ఐదు నిమిషాల పాటు చూడగలిగాం. అది మనుషులను చూసి ఎలాంటి ఆందోళన చెందలేదు. ఆ తర్వాత నెమ్మదిగా సముద్రంలోకి వెళ్లిపోయింది" అని డైవ్ అడ్డా స్కూబా డైవింగ్ శిక్షకుడు వైశాఖ్ శివరాజన్ తెలిపారు. అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సంఘం ఈ వేల్ షార్క్‌ను అంతరించిపోతున్న జాతుల జాబితాలో చేర్చింది. గతంలో విశాఖ తీరానికి తిమింగలాలు కొట్టుకువచ్చిన సందర్భాలు ఉన్నప్పటికీ, సముద్రంలో ఇలా సజీవంగా కనిపించడం చాలా అరుదు. గత నెలలో యారాడ బీచ్‌లో ఓ భారీ తిమింగలం ఒడ్డుకు కొట్టుకురాగా, మత్స్యకారులు కాపాడేందుకు ప్రయత్నించినా అది ప్రాణాలు విడిచిన సంగతి తెలిసిందే.

# ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి: జగన్

తాడేపల్లి, జనవరి 22 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడంపై వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ గురువారం కీలక ప్రకటన చేశారు. తనకు ప్రతిపక్ష నేత హోదా కల్పిస్తే తప్ప అసెంబ్లీలో అడుగుపెట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. అధికార కూటమి ప్రభుత్వ అక్రమాలను, తప్పుడు పనులను సభలో ఎండగట్టాలంటే ప్రతిపక్ష హోదా తప్పనిసరి అని, అప్పుడే తనకు తగినంత సమయం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగన్ మాట్లాడుతూ.. అసెంబ్లీలో ఏకైక ప్రతిపక్షంగా ఉన్న వైసీపీకి ఆ హోదా ఇవ్వడానికి స్పీకర్‌కు ఉన్న అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. "అసెంబ్లీలో ఉన్నది ఒక్కటే ప్రతిపక్షం, అది వైసీపీ మాత్రమే. మిగతా పార్టీలన్నీ ప్రభుత్వంలో భాగస్వాములే. మరి మాకు ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా స్పీకర్ ఎందుకు అడ్డుకుంటున్నారు ఇది ప్రజాస్వామ్యమా అని మీరు స్పీకర్‌ను ప్రశ్నించాలి" అని జగన్ అన్నారు. అసెంబ్లీకి హాజరుకాని ఎమ్మెల్యేలకు "పని చేయకపోతే జీతం లేదు" (నో వర్క్, నో పే) విధానం అమలు చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నిన్న లక్నోలో జరిగిన సదస్సులో సూచించిన నేపథ్యంలో జగన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. వైసీపీకి చెందిన 11 మంది ఎమ్మెల్యేలు 2024 నుంచి అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్న విషయం తెలిసిందే.



### భూ సర్వేలో చంద్రబాబుది 'క్రెడిట్ చోరీ'

భూముల సమగ్ర రీసర్వే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని జగన్ తీవ్రంగా ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన భూ రక్ష, భూ హక్కు పథకాలను చంద్రబాబు హైజాక్ చేశారని, ఈ బృహత్కార్యంలో ఆయన పాత్ర ఏమాత్రం లేకపోయినా ఘనతను దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తన పాదయాత్ర సందర్భంగా రైతులు భూ వివాదాలు, టైటిల్స్ సమస్యలపై తన వద్ద గోడు వెళ్లబోసుకున్నారని, అందుకే 2019 మేనిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చామని గుర్తుచేశారు. తమ హయాంలో రూ.6,000 కోట్లు ఖర్చు చేసి, దాదాపు 40,000 మంది సిబ్బందిని నియమించి అత్యాధునిక టెక్నాలజీతో సమగ్ర భూ సంస్కరణలు చేపట్టామని, ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ప్రశంసలు లభించాయని తెలిపారు. కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చాక, రైతులకు గతంలో ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలను వెనక్కి తీసుకుని, వాటి రంగు మార్చి మళ్లీ ఇస్తూ మొత్తం ఘనత తనదేనని ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ కొత్త పాస్‌బుక్‌లలో తప్పులు ఎక్కువగా ఉండటంతో రైతుల కష్టాలు మరింత పెరిగాయన్నారు. అంతేకాకుండా, ఈ పథకం అమలును ప్రశంసిస్తూ కేంద్రం ఇచ్చిన రూ.400 కోట్ల నిధులను కూడా టీడీపీ నాయకత్వం పక్కదారి పట్టించిందని ఆరోపించడం సంచలనం రేపింది.

### ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు

కూటమి ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని జగన్ ఆరోపించారు. సంక్రాంతి జూదం, గ్రామాల్లో విచ్చలవిడి మద్యం అమ్మకాలు, పైనుంచి కింది వరకు కమీషన్ల దందా నడుస్తోందని విమర్శించారు. ఇసుక ధరలు రెట్టింపు అయినా ప్రభుత్వ ఆదాయం పెరగలేదని, ఆ డబ్బు ఎక్కడికి పోతోందని ప్రశ్నించారు. అమరావతి పనుల్లో తమకు అనుకూలమైన కొద్దిమంది కాంట్రాక్టర్లకే అధిక రేట్లకు ప్రాజెక్టులు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ వ్యతిరేకత గరిష్ఠ స్థాయికి చేరినప్పుడు, సరైన సమయంలో పాదయాత్ర చేస్తామని జగన్ తెలిపారు. ఏడాది తర్వాత పాదయాత్ర చేపట్టి, మరో ఏడాది పాటు ప్రజల మధ్యే రోడ్లపై ఉంటామని పార్టీ సమావేశంలో చెప్పినట్లు ఆయన స్పష్టం చేశారు.

## శివరాత్రికి ముందే కోటప్పకొండకు
# కొత్త రోడ్డు
### ఇచ్చిన మాట నిలబెట్టుకున్న పవన్ కల్యాణ్

విజయవాడ, జనవరి 22 (ఈవార్తలు): ఏపీ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి భక్తులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. శివరాత్రి ఉత్సవాలలోపు రహదారి సౌకర్యం కల్పిస్తామన్న హామీని నెరవేరుస్తూ... కోటప్పకొండ - కొత్తపాలెం గ్రామాల మధ్య నిర్మించిన నూతన రహదారిని గురువారం ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. రూ.3.9 కోట్ల పంచాయతీరాజ్ నిధులతో 8 కిలోమీటర్ల మేర ఈ రోడ్డును నిర్మించారు. కోటప్పకొండ క్షేత్ర దర్శనం అనంతరం కొండ దిగువన ఉన్న శివస్థూపం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఆ తర్వాత రోడ్డుపై కొంత దూరం నడిచి, నిర్మాణ నాణ్యతను స్వయంగా పరిశీలించారు. గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్ బాబు ఈ రోడ్డు ఆవశ్యకతను పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. భక్తుల ఇబ్బందులను తొలగించేందుకు ఈ రహదారి నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పవన్, శివరాత్రి నాటికి రోడ్డును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నూతన రహదారితో మహాశివరాత్రి ఉత్సవాలకు తరలివచ్చే సుమారు లక్షన్నర మంది భక్తుల ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. అంతేకాకుండా, కొత్తపాలెం గ్రామ పరిసరాల్లోని రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు, గోనేపూడి పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు కూడా ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడనుంది. రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా గోనేపూడి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు పవన్ కల్యాణ్‌ను కలిసి, తమ కోసం రహదారి నిర్మించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ పాఠశాలకు క్రీడా మైదానంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ పర్యటనలో భాగంగా పవన్ కల్యాణ్.. కోటప్పకొండలో చేపట్టనున్న గిరిప్రదక్షిణ మార్గం నమూనా లేఅవుట్‌తో పాటు, జింకల పార్కును కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, జనసేన నరసరావుపేట ఇన్‌ఛార్జ్ సయ్యద్ జిలాని, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఇతర అధికారులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

# ఏడాదిన్నరలో పాదయాత్ర
### స్పష్టం చేసిన వైఎస్ జగన్

ఏలూరు, జనవరి 22 (ఈవార్తలు): ఏలూరులో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రకు సంబంధించి కీలక ప్రకటన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని, ఏ వర్గానికీ మేలు చేయలేదని విమర్శించారు. ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత పెరిగిందని, "జగన్ ఉంటే బాగుండేదని" ఇప్పుడు ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వానికి మిగిలింది ఇంకో మూడేళ్లేనని అన్నారు. ఇక తాను ఏడాదిన్నర తర్వాత పాదయాత్ర ప్రారంభిస్తానని జగన్ స్పష్టం చేశారు. ఈ ఏడాదిన్నర పాటు పూర్తిగా ప్రజల్లోనే ఉంటానని, ప్రతి వారం ఒక నియోజకవర్గ కార్యకర్తలతో భేటీ అవుతానని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఏలూరు నియోజకవర్గంతో మొదలు పెడుతున్నామని తెలిపారు. చంద్రబాబు పాలన మొత్తం అబద్ధాలు, మోసాలేనని ఆరోపించిన జగన్.. ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఎవరితోనైనా ఎలా కావాలంటే అలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పోలీస్ వ్యవస్థను కూడా దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా మారిందని జగన్ అన్నారు. ఒకప్పుడు ప్రభుత్వ స్కూళ్లకు డిమాండ్ ఉండేదని, ఇప్పుడు విద్యార్థులు భారీగా చదువు మానేస్తున్నారని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన మెడికల్ కాలేజీలను కూడా ఈ ప్రభుత్వం ప్రైవేటీకరిస్తోందని జగన్ ఆరోపించారు.



# దెబ్బతీస్తారు.. జాగ్రత్త: పవన్

మంగళగిరి, జనవరి 22 (ఈవార్తలు): జనసేన పార్టీపై ఎటువంటి దుష్టశక్తుల ప్రభావం పడకుండా జనసైనికులు, వీర మహిళలు, పార్టీ నాయకులు కాపు కాస్తున్నారని... పార్టీ పట్ల వారికున్న నిబద్ధత చాలా గొప్పదని ఏపీ డిప్యూటీ సీఎం ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. పార్టీకి చెందిన కొందరు కీలక నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. సంస్థాగత అంశాలపై నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో వ్యక్తుల మధ్య జరిగే ఘర్షణలు, ఆర్థిక లావాదేవీలు, మానసిక బలహీనతలు, వ్యక్తిగత కుల విభేదాలను జనసేన పార్టీకి ఆపాదించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కిరాయి వక్తులు, కిరాయి మాధ్యమాలు కలిసి పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రత్యేకంగా వివాహేతర సంబంధాలు వంటి వ్యక్తిగత అంశాలను కూడా జనసేనపై రుద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని పవన్ పేర్కొన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ విధమైన నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఇలాంటి దుష్ప్రచారాలను పార్టీ శ్రేణులు తీవ్రంగా ఖండించాలని సూచించారు.

## చర్లపల్లి - తిరువనంతపురం మధ్య కొత్త
# అమృత్ భారత్ రైలు

హైదరాబాద్, జనవరి 22 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రయాణికులకు భారతీయ రైల్వే శాఖ శుభవార్త అందించింది. తెలంగాణలోని చర్లపల్లి నుంచి కేరళలోని తిరువనంతపురం మధ్య నడిచే కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ రైలు ఆంధ్రప్రదేశ్‌లోని పలు కీలక స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుంది. ఈ కొత్త సర్వీసును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం (జనవరి 23) తిరువనంతపురంలో జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆంధ్రప్రదేశ్‌లో సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట జంక్షన్లలో ఆగుతుంది. దీనివల్ల రాష్ట్రంలోని ప్రయాణికులకు దక్షిణ భారతదేశంలోని ముఖ్య నగరాలకు ప్రయాణం మరింత సులభతరం కానుంది. ఇక తెలంగాణలో ఈ రైలుకు నల్గొండ, మిర్యాలగూడ స్టేషన్లలో హాల్ట్ కల్పించారు. ఈ రైలు షెడ్యూల్ ప్రకారం, తిరువనంతపురంలో ఉదయం 10:45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 4:30 గంటలకు చర్లపల్లి జంక్షన్‌కు చేరుకుంటుంది. తెలంగాణకు మరో అమృత్ భారత్ రైలును కేటాయించినందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలే లక్ష్యంగా, తక్కువ ధరలో సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు అమృత్ భారత్ రైళ్లను రూపొందించారు. ఇప్పటికే చర్లపల్లి నుంచి బీహార్‌లోని ముజఫర్‌పూర్ మధ్య ఒక అమృత్ భారత్ రైలు సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే.



## అనంత్ అంబానీ చేతికి

# 12.5 కోట్ల వాచ్

ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్ వారసుడు అనంత్ అంబానీ మరోసారి తన విలాసవంతమైన చేతి గడియారంతో వార్తల్లో నిలిచారు. ఆయన కోసం ప్రముఖ లగ్జరీ బ్రాండ్ జాకబ్ అండ్ కో ప్రత్యేకంగా తయారు చేసిన ఆపరా వంతార గ్రీన్ కామో వాచ్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. దీని విలువ సుమారు 1.5 మిలియన్ డాలర్లు, అంటే భారత కరెన్సీలో రూ.12.5 కోట్లు. ఇది కేవలం ఒక వాచ్ మాత్రమే కాదు, అనంత్ వన్యప్రాణి సంరక్షణ అభిరుచికి, ఆయన కలల ప్రాజెక్ట్ వంతారకు ప్రతిబింబంగా నిలుస్తోంది. ఈ వాచ్ రూపకల్పన అద్భుతంగా ఉంది. వాచ్ డయల్ మధ్యలో చేతితో చిత్రించిన అనంత్ అంబానీ చిన్న బొమ్మను అమర్చారు. దీనికి ఇరువైపులా ఒక సింహం, ఒక బెంగాల్ పులి సూక్ష్మమైన ప్రతిమలు ఉన్నాయి. ఇవి వంతార ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యాన్ని సూచిస్తాయి. దాదాపు 400 రత్నాలు, వజ్రాలు పొదిగి, పచ్చటి అడవిని తలపించేలా ఈ వాచ్‌ను రూపొందించారు. ఇందులో డిమాంటోయిడ్ గార్నెట్స్, సావొరైట్స్, గ్రీన్ సఫైర్స్ వంటి విలువైన రాళ్లను ఉపయోగించారు. ఈ రత్నాల మొత్తం బరువు 21.98 క్యారెట్లు. జాకబ్ అండ్ కో ఆపరా సిరీస్‌లో భాగంగా వచ్చిన ఈ వాచ్, సమయం చూపడంతో పాటు తిరిగే యంత్ర భాగాలు, సంగీతాన్ని వినిపించే ప్రత్యేకతలను కూడా కలిగి ఉంది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో 3,500 ఎకరాల్లో ఏర్పాటు చేసిన వంతార వన్యప్రాణి సంరక్షణ కేంద్రం స్ఫూర్తితోనే ఈ వాచ్‌ను డిజైన్ చేశారు. ఈ కేంద్రంలో అత్యాధునిక వెటర్నరీ ఆసుపత్రులు, 1,50,000 పైగా జంతువులు ఉన్నాయి. ప్రస్తుతం ఈ వాచ్‌పై సోషల్ మీడియాలో విస్తృత చర్చ జరుగుతోంది. కొందరు దీని అద్భుతమైన పనితనాన్ని ప్రశంసిస్తుంటే, మరికొందరు దీని ఖరీదుపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సంపద ప్రదర్శనతో పాటు ఒక ఆశయానికి ప్రతీకగా నిలిచే ఇలాంటి విలాసవంతమైన వస్తువులు నేటి సంపన్నులను ఆకర్షిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.





# యూపీపై గుజరాత్ విజయం

డబ్ల్యూపీఎల్‌లో భాగంగా గురువారం వడోదర వేదికగా జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 45 పరుగుల తేడాతో యూపీపై ఘన విజయం సాధించింది. ఈ సీజన్‌లో గుజరాత్‌కు ఇది మూడో విజయం. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 153 పరుగులు చేసింది. సోఫీ డివైన్ 50 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు కీలక ఇన్నింగ్స్ అందించగా, బెత్ మునీ 38 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన యూపీ జట్టు 17.3 ఓవర్లలో 108 పరుగులకే ఆలౌటైంది. లిచ్‌ఫీల్డ్ 32, ట్రయాన్ 30 పరుగులు తప్ప మిగతా బ్యాటర్లు రాణించలేదు. గుజరాత్ బౌలర్లలో రాజేశ్వరి గైక్వాడ్ 3 వికెట్లు తీసుకోగా, రేణుకా సింగ్, సోఫీ డివైన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. దీంతో గుజరాత్ జట్టు పూర్తి ఆధిపత్యంతో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.

## కోలుకున్న రూపాయి

### 15 పైసలు బలపడి 91.50 వద్ద ట్రేడ్

ముంబై: చారిత్రాత్మక కనిష్ఠ స్థాయుల నుంచి భారత రూపాయి ఇవాళ స్వల్పంగా కోలుకుంది. గ్రీన్‌లాండ్‌కు సంబంధించిన అంతర్జాతీయ ఉద్రిక్తతలు తగ్గడంతో మార్కెట్ సెంటిమెంట్‌కు కొంత ఊరట లభించింది. ఫలితంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 15 పైసలు బలపడి 91.50 వద్ద ట్రేడ్ అవుతోంది. సమీప భవిష్యత్తులో రూపాయి ఒడిదొడుకులు కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ, ఇటీవలి కాలంలో చూసినంత వేగంగా పతనం ఉండకపోవచ్చని డీబీఎస్ బ్యాంక్ తన నివేదికలో అంచనా వేసింది. డీబీఎస్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీనియర్ ఎకనమిస్ట్ రాధికా రావు మాట్లాడుతూ.. అంతర్జాతీయ, దేశీయ అంశాలు కలిసి రూపాయిపై ఒత్తిడి పెంచాయని తెలిపారు. ప్రపంచ మార్కెట్లలో భయాలను సూచించే వీఐఎక్స్ సూచీ పెరగడం, అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, బాండ్ ఈల్డ్స్ పెరగడం వంటివి రూపాయిని బలహీనపరిచాయి. ఈ నేపథ్యంలో గ్రీన్‌లాండ్ ఉద్రిక్తతలు తగ్గడం మార్కెట్లకు ఊరటనిచ్చే అంశం అని ఆమె వివరించారు. మరోవైపు యూరోపియన్ యూనియన్‌తో కీలక వాణిజ్య ఒప్పందం వచ్చే వారం ఖరారయ్యే అవకాశం ఉండటం, దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో అమెరికాతో వాణిజ్య చర్చలపై సానుకూల సంకేతాలు రావడం కూడా మార్కెట్లకు కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి.

# మిత్రదేశాలపై ట్రంప్ టారిఫ్ రద్దు



వాషింగ్టన్: గ్రీన్‌ల్యాండ్‌ను తమ దేశంలో విలీనం చేసుకునే విషయంలో తీవ్రంగా ప్రయత్నించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్యంగా వెనక్కి తగ్గారు. గ్రీన్‌ల్యాండ్‌ను తమకు అప్పగించాలంటూ యూరప్ మిత్రదేశాలను బెదిరించిన ఆయన, ఇప్పుడు తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. ఆర్కిటిక్ భద్రతకు సంబంధించి నాటోతో ఒక భవిష్యత్ ఒప్పందానికి మార్గం సుగమమైందని, ఈ నేపథ్యంలో యూరప్ దేశాలపై విధించాలనుకున్న టారిఫ్‌లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రకటనతో నాటో కూటమిలో తలెత్తిన తీవ్ర సంక్షోభానికి తాత్కాలికంగా తెరపడినట్లయింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ... గ్రీన్‌ల్యాండ్ హక్కు, టైటిల్, యాజమాన్యం తమకు కావాలని, అయితే దాని కోసం సైనిక బలగాలను ఉపయోగించబోమని స్పష్టం చేశారు. రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా వల్లే యూరప్ నిలబడిందని, దశాబ్దాలుగా తాము చేసిన సాయంతో పోలిస్తే గ్రీన్‌ల్యాండ్‌ను అడగటం చాలా చిన్న విషయమని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ మాటలు నాటో కూటమి పునాదులను కదిలించేలా ఉండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది. ఆర్కిటిక్ మహాసముద్రంలో రష్యా, చైనాల నుంచి ఎదురవుతున్న ముప్పును ఎదుర్కోవాలంటే ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపమైన గ్రీన్‌ల్యాండ్ తమ నియంత్రణలో ఉండటం అత్యవసరమని ట్రంప్ చాలాకాలంగా వాదిస్తున్నారు. ఈ క్రమంలోనే గ్రీన్‌ల్యాండ్‌ను అప్పగించని పక్షంలో డెన్మార్క్‌తో పాటు మరో ఏడు మిత్రదేశాలపై వచ్చే నెల నుంచి 10 శాతం, జూన్ నాటికి 25 శాతం దిగుమతి సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. అయితే, డెన్మార్క్ ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో మొదటి నుంచి గట్టిగా నిలబడింది. అమెరికా భద్రతాపరమైన ఆందోళనలపై చర్చకు సిద్ధమే కానీ, గ్రీన్‌ల్యాండ్ సార్వభౌమాధికారం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. ట్రంప్ బెదిరింపులతో గ్రీన్‌ల్యాండ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ప్రజలకు సూచిస్తూ, ఐదు రోజులకు సరిపడా ఆహారం, నీరు, ఇంధనం వంటి నిత్యావసరాలను నిల్వ చేసుకోవాలని కోరింది. దీంతో అక్కడి ప్రజలు ఆందోళనతో దుకాణాలకు పరుగులు తీశారు. తాజా పరిణామాలతో ట్రంప్ టారిఫ్‌ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నప్పటికీ, ఆర్కిటిక్ ప్రాంతంపై పట్టు సాధించాలన్న ఆయన వ్యూహం మాత్రం మారలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. నాటోతో కుదిరిన ఫ్రేమ్‌వర్క్ డీల్ స్వరూపంపై స్పష్టత వస్తేనే ఈ వివాదం పూర్తిగా సద్దుమణిగినట్లు భావించాలని వారు అభిప్రాయపడుతున్నారు.

## టీమిండియా అనొద్దా.. మీకేం సమస్య?

### పిటిషన్‌పై సుప్రీం కోర్టు తీవ్ర అసహనం

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టును టీమిండియా అని పిలవకుండా ఆదేశాలు ఇవ్వాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి అర్థం లేని పిటిషన్లతో న్యాయస్థానం సమయాన్ని వృథా చేయవద్దని పిటిషనర్‌కు గట్టిగా హితవు పలికింది. ఈ వ్యాజ్యాన్ని కొట్టివేస్తున్నట్టు గురువారం స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే, న్యాయవాది రీపక్ కన్సల్ సుప్రీంకోర్టులో ఒక పిల్ దాఖలు చేశారు. బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బీసీసీఐ) ఒక ప్రైవేటు సంస్థ అని, దానికి చెందిన జట్టును టీమిండియా లేదా భారత జాతీయ జట్టుగా పిలవడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పేరు వినియోగించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేదని, కాబట్టి ప్రసార భారతి వంటి సంస్థలు అలా సంబోధించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇంట్లో కూర్చుని ఇలాంటి పిటిషన్లు వేస్తుంటారు. అసలు ఆ పేరుతో మీకేం సమస్య ఆ జట్టు దేశం తరఫున ప్రపంచవ్యాప్తంగా ఆడుతోంది కదా అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఇది పూర్తిగా అర్థం లేని పిటిషన్ అని, దీనివల్ల కోర్టు సమయంతో పాటు మీ సమయం కూడా వృథా అవుతుందని ఘాటుగా వ్యాఖ్యానించింది. గతంలో ఇదే పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కూడా తిరస్కరించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేయవచ్చు. అప్పుడు కూడా టైమ్ వేస్ట్ అని హైకోర్టు వ్యాఖ్యానించింది. తాజాగా సుప్రీంకోర్టు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

## వేల కోట్ల కంపెనీకి అధిపతిగా పరాగ్

### ఘనంగా తిరిగొచ్చిన ట్విట్టర్ మాజీ సీఈవో

### పారలెల్ వెబ్ సిస్టమ్స్ పేరుతో కొత్త ఏఐ స్టార్టప్ ప్రారంభం

### కంపెనీ విలువ రూ. 6000 కోట్లకు పైమాటే

న్యూఢిల్లీ: ఎక్స్ (ట్విట్టర్) మాజీ సీఈఓ పరాగ్ అగర్వాల్ పేరు చెప్పగానే, ఎలాన్ మస్క్ ఆయన్ను పదవి నుంచి తొలగించిన ఘటనే గుర్తుకొస్తుంది. కానీ, సరిగ్గా రెండేళ్ల తర్వాత పరాగ్ టెక్ ప్రపంచంలోకి ఘనంగా పునరాగమనం చేశారు. ఆయన స్థాపించిన పారలెల్ వెబ్ సిస్టమ్స్ అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) స్టార్టప్ ఇప్పుడు ఏకంగా రూ. 6,000 కోట్లకు పైగా విలువతో సంచలనం సృష్టిస్తోంది. 2022 అక్టోబరులో ఎలాన్ మస్క్ ట్విట్టర్‌ను స్వాధీనం చేసుకున్న వెంటనే పరాగ్‌ను సీఈఓ పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఫేక్ అకౌంట్ల విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మస్క్ ఆయన్ను అవమానకరంగా ఆఫీసు నుంచి బయటకు పంపించడంతో అప్పట్లో ఇది పెద్ద చర్చనీయాంశమైంది. అప్పటి నుంచి దాదాపు రెండేళ్ల పాటు పరాగ్ అగర్వాల్ పెద్దగా వార్తల్లో కనిపించలేదు. అయితే, ఈ విరామంలో ఆయన తన పాత మిత్రులతో కలిసి ఒక కొత్త ఏఐ స్టార్టప్‌ను ప్రారంభించారు. డెవలపర్స్ కోసం అత్యాధునిక ఏఐ టూల్స్‌ను రూపొందించడమే లక్ష్యంగా ఈ సంస్థను నిర్మించారు. పరాగ్ ప్రతిభపై నమ్మకంతో ఖోస్లా వెంచర్స్ వంటి ప్రముఖ సంస్థలు సుమారు రూ. 250 కోట్ల ప్రారంభ పెట్టుబడిని అందించాయి. ముంబై ఐఐటీలో చదువుకున్న పరాగ్ అగర్వాల్, 2011లో సాధారణ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ట్విట్టర్‌లో చేరారు. తన ప్రతిభతో అంచెలంచెలుగా ఎదుగుతూ 2021లో కంపెనీకి సీఈఓ అయ్యారు. ఉద్యోగం కోల్పోయినప్పటికీ నిరాశ చెందకుండా, తన నైపుణ్యంతోనే తిరిగి సమాధానం చెప్పారు. మస్క్ ఆయనను ఉద్యోగం నుంచి తొలగించగలిగినా, ఆయనలోని ప్రతిభను మాత్రం ఆపలేకపోయారని ఈ విజయం నిరూపిస్తోంది.

## వైట్ కాలర్ ఉద్యోగాలకు ఏఐ ముప్పు

### మరో 4-5 ఏళ్లలో పెను మార్పులు: బిల్ గేట్స్

న్యూయార్క్: మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ కృత్రిమ మేధ విషయంలో ప్రపంచ దేశాలకు కీలక హెచ్చరికలు జారీ చేశారు. రాబోయే కొన్ని సంవత్సరాల్లోనే ఏఐ ప్రభావంతో ఉద్యోగ మార్కెట్, ముఖ్యంగా వైట్ కాలర్ రంగం ఊహించని విధంగా మారిపోతుందని, ఈ పెను మార్పులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు సిద్ధంగా లేవని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరమ్ సదస్సులో ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో గేట్స్ మాట్లాడారు. రాబోయే 4 నుంచి 5 ఏళ్లలో వైట్ కాలర్, బ్లూ కాలర్ రంగాల్లో భారీ మార్పులు రానున్నాయి. పెరుగుతున్న అసమానతలను పరిష్కరించేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాల్సి ఉంటుంది అని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఏఐ ప్రభావం పరిమితంగానే ఉన్నా, ఈ పరిస్థితి ఎంతోకాలం ఉండదని అన్నారు. గత సాంకేతిక విప్లవాలతో పోలిస్తే ఏఐ చాలా వేగంగా, లోతుగా సమాజంలోకి చొచ్చుకుపోతోందని గేట్స్ వివరించారు. విద్య, వైద్యం వంటి రంగాల్లో ఏఐతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ఉద్యోగ నియామకాలు, ఆర్థిక సమానత్వంపై దాని ప్రభావాన్ని నియంత్రించకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగులకు కొత్త నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వడం, పన్నుల విధానాన్ని మార్చడం వంటి అంశాలపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని సూచించారు. మారుతున్న ప్రపంచ రాజకీయ పరిస్థితుల్లో భారత్–అమెరికా భాగస్వామ్యం ఒక నమ్మకమైన శక్తిగా నిలుస్తుందని గేట్స్ అభిప్రాయపడ్డారు.

## బెంగళూరులో విదేశీ మహిళతో

# స్టాఫ్ అసభ్య ప్రవర్తన

బెంగళూరు: బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. సెక్యూరిటీ చెక్ పేరుతో ఓ కొరియా మహిళపై లైంగిక దాడికి పాల్పడిన గ్రౌండ్ స్టాఫ్ సభ్యుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణికుల భద్రతకే ముప్పు కలిగించిన ఈ ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 19న ఓ కొరియా మహిళ తన స్వదేశానికి వెళ్లేందుకు విమానాశ్రయానికి వచ్చారు. ఇమ్మిగ్రేషన్ తనిఖీలు పూర్తి చేసుకుని టెర్మినల్ వైపు వెళుతుండగా, ఎయిర్ ఇండియా శాట్స్ గ్రౌండ్ సర్వీసెస్‌లో పనిచేస్తున్న మహమ్మద్ అఫాన్ అనే ఉద్యోగి ఆమెను అడ్డగించాడు. ఆమె ఫ్లైట్ టికెట్ పరిశీలించి, చెక్-ఇన్ లగేజీ నుంచి బీప్ సౌండ్ వస్తోందని, సమస్య ఉందని చెప్పాడు. తిరిగి స్క్రీనింగ్ కౌంటర్‌కు వెళితే విమానం మిస్సయ్యే ప్రమాదం ఉందని, తాను ప్రత్యేకంగా తనిఖీ చేస్తానని నమ్మించాడు. అనంతరం ఆమెను పురుషుల వాష్‌రూమ్ సమీపంలోకి తీసుకెళ్లి, అభ్యంతరాలు పెడుతున్నా వినకుండా అసభ్యంగా తాకాడు. ఆమె ప్రతిఘటించడంతో ఆమెను కౌగిలించుకుని, థ్యాంక్యూ అని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటనతో షాక్‌కు గురైన ఆ మహిళ వెంటనే విమానాశ్రయ భద్రతా సిబ్బందికి ఫిర్యాదు చేసింది. వారు వెంటనే స్పందించి నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, అఫాన్ దారుణ ప్రవర్తన స్పష్టంగా రికార్డయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి తదుపరి విచారణ జరుపుతున్నారు.

## కర్ణాటక గవర్నర్‌పై ప్రభుత్వం ఆగ్రహం

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీలో వివాదం చెలరేగింది. అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ తన ప్రసంగాన్ని రెండు మాటలతోనే ముగించి సభలో నుంచి వెళ్లిపోయారు. ఉపాధి హామీ పథకంపై కేంద్రానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగాన్ని గెహ్లాట్ చదవలేదు. దీంతో గవర్నర్ గెహ్లాట్ తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మండిపడుతుండగా.. బీజేపీ ఎమ్మెల్యేలు గవర్నర్ సరైన నిర్ణయం తీసుకున్నారంటూ సమర్థిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ప్రసంగించాల్సి ఉంది. సాధారణంగా ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగం కాపీని గవర్నర్ సభలో చదువుతారు. ఈ సంప్రదాయం మేరకు సిద్ధరామయ్య ప్రభుత్వం గవర్నర్ కు ప్రసంగం కాపీ అందించింది. అయితే, అందులో ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి చేసిన మార్పులను వ్యతిరేకించింది. కేంద్రం తీరుకు నిరసనగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని ఈ ప్రసంగం కాపీలో ప్రస్తావించింది. దీనిని చదివేందుకు నిరాకరించిన గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్.. సింపుల్ గా 'రాష్ట్రం ప్రగతి మార్గంలో నడుస్తోంది.. సమావేశాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ ప్రసంగాన్ని ముగించేశారు. ఆపై సభలో నుంచి వెళ్లిపోతుండగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆయనను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్య అని సీఎం సిద్ధరామయ్య కూడా గవర్నర్ పై మండిపడ్డారు. అయితే, కేంద్రానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగాన్ని చదవకూడదని గవర్నర్ సరైన నిర్ణయం తీసుకున్నారంటూ బీజేపీ ఎమ్మెల్యేలు సమర్థించారు. కేంద్ర ప్రభుత్వాన్ని అవమానించాలన్న కాంగ్రెస్ కుటిల ప్రయత్నాన్ని సరిగ్గా తిప్పికొట్టారంటూ గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర కొనియాడారు. గవర్నర్ పట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రవర్తనకు సీఎం సిద్ధరామయ్య క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## 3 రోజుల నష్టాలకు బ్రేక్

ముంబై: వరుసగా మూడు రోజుల నష్టాలకు గురువారం బ్రేక్ పడింది. దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, తగ్గుముఖం పట్టిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 397.74 పాయింట్లు పెరిగి 82,307.37 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 132.4 పాయింట్లు లాభపడి 25,289.9 వద్ద ముగిసింది. యూరోపియన్ యూనియన్ దేశాలపై ఫిబ్రవరి 1న టారిఫ్‌లు విధించబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం మార్కెట్లకు కలిసొచ్చింది. అలాగే, గ్రీన్‌లాండ్‌పై నాటోతో భవిష్యత్ ఒప్పందానికి ఒక ఫ్రేమ్‌వర్క్ కుదిరిందని, భారత్‌తో గొప్ప వాణిజ్య ఒప్పందం కుదురుతుందని ఆయన చేసిన వ్యాఖ్యలు కొనుగోళ్లను ప్రోత్సహించాయి. బీఎస్ఈలో అదానీ పోర్ట్స్, బీఈఎల్, ఎస్బీఐ, టాటా స్టీల్ వంటి హెవీవెయిట్ షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. మరోవైపు, ఇటర్నల్, టైటాన్, మారుతీ సుజుకీ, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టాలతో ముగిశాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ రియల్టీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ మినహా అన్ని రంగాల సూచీలు లాభాల్లోనే ఉన్నాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ మీడియా సూచీలు 2 శాతానికి పైగా పెరిగి టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ ఇదే సానుకూల ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.34 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.76 శాతం చొప్పున పెరిగాయి. మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీ 25,120 స్థాయికి పైన ఉన్నంత వరకు మార్కెట్ నిలకడగా ఉండి, క్రమంగా 25,400--25,500 స్థాయిల వైపు వెళ్లే అవకాశం ఉంది. ఒకవేళ 25,120 స్థాయిని కోల్పోతే, అమ్మకాల ఒత్తిడి పెరిగి 25,100 దిశగా పడిపోవచ్చని హెచ్చరిస్తున్నారు.



ఈవార్తలు
# వినోదవాణి CINEMA
శుక్రవారం 23-1-2026 | www.evarthalu.com


## వయ్యారి చిత్రం


రోష్ని సర్దానా



## పవర్ ఫుల్ పాత్రలో..

టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో మిల్కీ బ్యూటీగా పేరు సొంతం చేసుకుంది తమన్నా భాటియా. ఒకప్పుడు రామ్ చరణ్, ఎన్టీఆర్, ప్రభాస్ ,అల్లు అర్జున్ లాంటి అగ్ర కథానాయకుల సరసన నటించి స్టార్ హీరోయిన్ గా భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. ఇక కెరియర్ పీక్స్ లో ఉండగానే స్పెషల్ సాంగ్స్ లో చేయడం మొదలుపెట్టిన ఈమె.. ఆ తర్వాత కథల ఎంపిక విషయంలో చేసిన తప్పిదం ఆమెకు మళ్ళీ మునుపటి వైభవాన్ని అందించలేదనే వార్తలు ఎప్పటికప్పుడు వినిపిస్తూనే ఉంటాయి. ఈమెతో పాటు ఇండస్ట్రీలోకి వచ్చిన నయనతార, త్రిష, కాజల్ అగర్వాల్ లాంటి హీరోయిన్లు ఇప్పటికీ వరుస సినిమాలలో హీరోయిన్లుగా దూసుకుపోతుంటే.. తమన్నా మాత్రం ఇంకా స్పెషల్ సాంగ్‌లకే పరిమితం అవడం అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. అయితే, తాజాగా రోహిత్ శెట్టి దర్శకత్వంలో జాన్ అబ్రహం హీరోగా మారియా ఐపీఎస్ అనే ఒక బయోపిక్ తీస్తున్నారు. ఈ సినిమా బలమైన భావోద్వేగాల చుట్టూ తిరుగుతుందని నిర్మాతలు స్పష్టం చేశారు. 1993లో డిప్యూటీ కమిషనర్ పోలీస్ ఆఫీసర్ గా పని చేసిన రాకేష్ మారియా జీవితం ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. ముంబై వరుస పేలుళ్ల కేసును పరిష్కరించడంలో రాకేష్ మారియా కీలకపాత్ర పోషించారు. ముఖ్యంగా 2003 గేట్వే ఆఫ్ ఇండియా, జవేరి బజార్ జంట పేలుళ్ల కేసును ఛేదించడానికి ఈయన ధైర్యం ఎంతో సహాయపడింది. టాక్సీలలో పేలుడు పరికరాలను అమర్చిన జంటతో సహా మొత్తం ఆరుగురు నిందితులను ఆయన అరెస్టు చేశారు. ఇలాంటి ఒక పవర్ఫుల్ ఆఫీసర్ బయోపిక్ మారియా ఐపీఎస్ అనే టైటిల్ తో రాబోతోంది. ఇప్పుడు ఈ చిత్రంలో మారియా ఐపీఎస్ పాత్రలో జాన్ అబ్రహం నటిస్తుండగా.. ఆయన భార్య పాత్రను తమన్నా భాటియా పోషిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఆమె పాత్ర గణనీయంగా మరింత ప్రభావవంతంగా ఉంటుందని మేకర్స్ స్పష్టం చేశారు. ఈ సినిమా సూపర్ హిట్ అయితే పాత తమన్నా తిరిగి వచ్చినట్టే అని అభిమానులు ఆశిస్తున్నారు.


## అక్కినేని కోడలా.. మజాకా!

సినిమా ఇండస్ట్రీకి వచ్చే హీరోయిన్లు అంతా లెక్కలేసుకునే వస్తుంటారు. ఫలానా హీరోతో నటించాలి. అక్కడే స్థిరపడాలి. ఆ ఇండస్ట్రీ వాళ్లనే పెళ్లి చేసుకుని స్థిరపడాలి అంటూ కొందరు భామలు కొన్ని లెక్కలతో తెలివిగా ఎంటర్ అవుతుంటారు. ఇలాంటి వారికి అక్కినేని కోడలు శోభిత ధూళిపాళ మాత్రం పూర్తి వ్యతిరేకం. ఎందుకంటే ఇండస్ట్రీకి తాను ఎలాంటి లెక్కలు వేసుకోకుండానే వచ్చానన్నారు. ఇంటర్ పూర్తి చేసిన తర్వాత శోభిత ముంబై వెళ్లిపోయారు. అక్కడే సినీ ప్రయాణం మొదలు పెట్టారు. కేవలం తాను ఎంజాయ్ చేయాలనుకునే కథల్లోనే నటించారు. అంతే తప్ప ఒకే ఇండస్ట్రీలో జెండా పాతేయాలని ఏనాడు అనుకోలేదన్నారు. బాలీవుడ్ లో సినిమాలు చేస్తున్నప్పుడు దక్షిణాది అమ్మాయి అనేవారు. తెలుగులో సినిమాలు చేస్తే బాంబే అమ్మాయి అంటారు. మరో పరిశ్రమకు వెళ్తే వాళ్లకు తోచింది ఇంకేదో అంటారు. గుర్తింపు అనేది పరిశ్రమను బట్టి మారిపోతుంది. ఓ ఏడాదికి ఇన్ని సినిమాలు..ఇన్ని సిరీస్లు చేయాలని ప్రత్యేకంగా అనుకోలేదన్నారు. బేరాలు-లెక్కలు వేసుకుంటే పని చేయడం కష్టమవుతుందన్నారు.



## ఫుట్‌బాల్ ప్లేయర్‌తో లవ్‌లో నేహా శర్మ

అందాల కథానాయిక నేహా శర్మ తన వ్యక్తిగత విషయాలను చాలా రహస్యంగా ఉంచుతారు. అయితే ఇటీవల ఒక విదేశీ వ్యక్తితో చెట్టాపట్టాలేసుకుని షికార్లు చేస్తూ కనిపించడంతో సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. తాజా సమాచారం మేరకు... క్రొయేషియాకు చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారుడు పీటర్ స్లిస్కోవిక్ తో శర్మా గాళ్ డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. వీరిద్దరూ ముంబై వీధుల్లో ఒకరి చేతిని మరొకరు పట్టుకుని నడుస్తూ కెమెరాలకు చిక్కారు. ఈ ఫోటోలు, వీడియోలు ఇంటర్నెట్‌లో వైరల్ అయ్యాయి. అంతేకాకుండా, నేహా తన సోదరి ఆయేషా శర్మతో కలిసి పీటర్ స్లిస్కోవిక్‌తో డిన్నర్‌కు వెళ్లినప్పుడు కూడా మీడియా కంట పడ్డారు. పీటర్ స్లిస్కోవిక్ ఎవరు అంటే..అతడు 33 ఏళ్ల ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ ప్లేయర్. ఇండియన్ సూపర్ లీగ్ లో భాగంగా చెన్నైయిన్ ఎఫ్‌సి, జంషెడ్‌పూర్ ఎఫ్‌సి వంటి టీమ్‌ల తరపున ఆడారు. అయితే తమ రిలేషన్ షిప్ గురించి నేహా శర్మ కానీ, పీటర్ కానీ ఇప్పటి వరకు అధికారికంగా స్పందించలేదు. గతంలో కూడా నేహా శర్మ తన సహనటులతో డేటింగ్‌లో ఉన్నట్లు కొన్ని రూమర్లు వచ్చాయి.. కానీ వాటిని ఎప్పుడూ ధృవీకరించలేదు. కొందరు క్రికెటర్లతో కూడా ఎఫైర్ కహానీలు వినిపించాయి. నేహా శర్మకు యువరాజ్ సింగ్, కేఎల్ రాహుల్‌లతో ముడిపెడుతూ గతంలో కొన్ని పుకార్లు వచ్చాయి. యువరాజ్ సింగ్ తన కెరీర్ ఆరంభంలో చాలా మంది బాలీవుడ్ నటీమణులతో డేటింగ్ చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే యువరాజ్ సింగ్‌తో నేహా శర్మ ఎఫైర్ గురించి బలమైన ఆధారాలు ఏవీ లేవు.





## మాది అందమైన అనుబంధం

ప్రియుడితో రిలేషన్‌పై ఫరియా అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేసింది. తన ప్రియుడు ముస్లిం కాదని, హిందు కుటుంబానికి చెందిన వ్యక్తి అని తెలిపింది. బాల్య స్నేహితుడని జరుగుతోన్న ప్రచారాన్ని కూడా ఖండించింది. అతడు సినిమా ఇండస్ట్రీలో ఉంటోన్న కుర్రాడే. కొరియోగ్రాఫర్ గా పని చేస్తున్నాడంది. కొంత కాలంగా అతడితో కలిసి తాను కూడా పని చేస్తున్నట్లు తెలిపింది. డాన్స్ సహా తనలో వచ్చిన కొన్ని రకాల మార్పులకు ప్రియుడే కారణమంది. తమ మధ్య ఉన్న బంధం లవ్ ఎఫైర్ కాదని..అదొక అందమైన అనుబంధం అంటూ చెప్పుకొచ్చింది. ఫరియా అబ్దుల్లా పుట్టి పెరిగింది హైదరాబాద్ లోనే. లయోలా అకాడమీలో మాస్ కమ్యూనికేషన్ పూర్తి చేసింది. సినిమాల్లోకి రాకముందు థియేటర్ ఆర్టిస్ట్‌గా పనిచేసింది. అమ్మడు మంచి పెయింటర్, కవయిత్రి. కథక్, హిప్-హాప్ వంటి వివిధ డ్యాన్స్ మంచి ప్రావీణ్యం ఉంది.



## అన్నింటికీ సిద్ధపడ్డా


### : మాళవిక మోహనన్

ఇండస్ట్రీకి కొత్తగా వచ్చే వాళ్లు ఇక్కడ ఉండే నెగిటివిటీని తట్టుకునేందుకు ముందుగానే సిద్ధపడాల్సి ఉంటుంది. ఇండస్ట్రీలో ఉండే ఇబ్బందులు, వృతి పరంగా ఎదురు అయ్యే సవాళ్లు, ట్రోల్స్ ఇలా ప్రతి విషయాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. అలా ఉన్నప్పుడు మాత్రమే ఇండస్ట్రీలో నెగ్గుకు రాగలుగుతారు. అందుకు తాను కూడా మినహాయింపు కాదని అంటోంది మాళవిక మోహనన్. 'ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో నెగటివ్ ట్రోల్స్‌కి కాస్త ఇబ్బంది పడేదాన్ని. కానీ ఇప్పుడు ఆ ట్రోల్స్ ను పట్టించుకోవడం లేద'ని చెప్పుకొచ్చింది. అంతే కాకుండా కారణం లేకుండా ఊరికే ట్రోల్ చేయాలని, ఏదో ఒక కామెంట్ చేయాలని చూసే వారిని అసలు పట్టించుకోవద్దని కూడా మాళవిక చెప్పుకొచ్చింది. ఇండస్ట్రీలో ఉన్నప్పుడు మన గురించి బహిరంగంగా మాట్లాడుతూ ఉంటారు. వాటన్నింటి గురించి ఆలోచిస్తే కెరీర్ పై దృష్టి పెట్టలేమని కూడా ఆమె పేర్కొంది.

## బికినీ ట్రీట్‌తో ఆషికకు చాన్సుల వెల్లువ

భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమాలో బికినీ ట్రీట్ అందించిన ఆషిక రంగనాథ్‌కు ఇప్పుడు చాన్సులు వరుసపెట్టి క్యూ కడుతున్నాయట. కన్నడ ఇండస్ట్రీలో కెరీర్ ప్రారంభించిన ఆషిక రంగనాథ్, అక్కడ వరుస సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత తెలుగులో అడుగుపెట్టి అమిగోస్, నా సామి రంగా, లవర్ వంటి చిత్రాల్లో నటించి టాలీవుడ్ ప్రేక్షకులకు దగ్గరయ్యారు. తాజాగా, యంగ్ హీరో శర్వానంద్ మూవీలో ఛాన్స్ అందుకున్నట్లు తెలుస్తోంది. దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కనున్న ఆ చిత్రంలో ఆషిక హీరోయిన్ గా ఎంపికైనట్లు సమాచారం. ఇందులో ఆషిక పాత్రకు మంచి ప్రాధాన్యం ఉంటుందని, గ్లామర్ తో పాటు నటనకు కూడా అవకాశం ఉన్న రోల్ ను రూపొందిస్తున్నారని తెలుస్తోంది. ఆషికకు శర్వా- శ్రీను వైట్ల మూవీ టాలీవుడ్ కెరీర్ లో టర్నింగ్ పాయింట్ కావచ్చని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. స్టార్ హీరో సరసన, పేరు ఉన్న దర్శకుడితో పని చేసే అవకాశం రావడం ఆమె కెరీర్ కు ప్లస్ అయ్యే అంశంగా మారనుంది.





## ఆర్సీబీ గొప్పగా ఆడింది: ధోనీ

ఐపీఎల్ 2025 సీజన్‌లో విజేతగా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)కి చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్, టీమిండియా దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ అభినందనలు తెలిపాడు. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ధోనీని.. ఓ అభిమాని ఆర్సీబీ ఐపీఎల్ టైటిల్ గెలవడంపై మీ రియాక్షన్ ఏంటని ప్రశ్నించాడు. దీనికి ధోనీ స్పందిస్తూ.. చెన్నై ఆటగాడిగా ఉంటూ మరో జట్టు టైటిల్ గెలవాలని తాను కోరుకోనని బదులిచ్చాడు. ఆర్సీబీ బాగా ఆడిందని, ఆ జట్టుకు తన శుభాకాంక్షలని తెలియజేశాడు. 'నేను చెన్నై సూపర్ కింగ్స్ జట్టు సభ్యుడిగా ఉంటూ.. మరో జట్టు ఐపీఎల్ టైటిల్ గెలవడాన్ని అసలు ఏ మాత్రం ఊహించుకోలేను. కానీ ఆర్సీబీ టైటిల్ కోసం చాలా ఏళ్లు నిరీక్షించింది. వారు బాగా ఆడి తమ కలను నెరవేర్చుకున్నారు.వారికి నా శుభాకాంక్షలు. ఈ విషయాన్ని నేను అప్పుడు కూడా చెప్పాను. కీలకమైన విషయం ఏంటంటే.. మనం ఓ టోర్నీ ఆడుతున్నప్పుడు అందులో మన జట్టే గెలవాలని కోరుకుంటాం. కానీ ప్రతీసారి మనకు అనుకూలంగానే ఫలితాలు రావు. మనం ఊహించనది ఏదైనా జరిగితే.. ప్రత్యర్థి జట్ల నుంచి మనం ఎంతో కొంత నేర్చుకోవచ్చు. ఈ టోర్నీలో ఇది కూడా ఓ కీలకమైన అంశం' అని ధోనీ పేర్కొన్నాడు.




# బంగ్లాదేశ్ బాయ్‌కాట్

## టీ20 వరల్డ్ కప్‌లో ఆడబోమని వెల్లడి

టీ20 వరల్డ్‌కప్ వేదికలను మార్చడానికి ఐసీసీ నిరాకరించడంతో.. ఆ టోర్నీను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు బహిష్కరించింది. ఫిబ్రవరి 7వ తేదీ నుంచి ప్రారంభంకానున్న వరల్డ్‌కప్‌లో ఆడేందుకు ఇండియా వెళ్లడం లేదని బంగ్లా క్రికెట్ బోర్డు పేర్కొన్నది. గురువారం ఢాకాలో క్రికెట్ బోర్డు, జాతీయ క్రికెటర్లు, క్రీడా మంత్రి ఆసిఫ్ నజ్రుల్ మధ్య జరిగిన చర్చల అనంతరం ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. ఆటగాళ్ల భద్రతకు సమస్య లేదని ఐసీసీ పేర్కొన్నా.. ఇండియాలో ట్రావెల్ చేసేందుకు బీసీబీ నిరాకరిస్తున్నది. ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు పెరగడంతో.. ఐపీఎల్‌లో ఆడుతున్న ముస్తఫిజుర్‌ను తొలగిస్తూ బీసీసీఐ నిర్ణయం తీసుకున్నది. ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బంగ్లా క్రికెటర్లు ఇండియాలో పర్యటించేందుకు నిరాకరిస్తున్న విషయం తెలిసిందే. వేదికల మార్పు విషయంలో ఐసీసీ తీసుకున్న నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని నజ్రుల్ పేర్కొన్నారు. ఇండియాకు వెళ్లవద్దు అని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. అయితే తమ మ్యాచ్‌లను శ్రీలంకలో ఆడేందుకు తమకు ఐసీసీ అవకాశం ఇస్తుందని ఆశిస్తున్నామని ఆయన అన్నారు. వరల్డ్‌కప్‌లో భాగంగా బంగ్లాదేశ్ జట్టు ఇండియాలో నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్నది. మూడు కోల్‌కతాలో, ఒకటి ముంబై వేదికగా ఆ మ్యాచ్‌లు షెడ్యూల్‌లో ఉన్నాయి. ఒకవేళ బంగ్లా రాకపోతే ఆ జట్టు స్థానంలో స్కాట్‌ల్యాండ్ ఆడే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

### బంగ్లాకు హ్యాండిచ్చిన పాక్



తొలుత బంగ్లాదేశ్‌కు అండగా నిలిచిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు.. ఇప్పుడు మెల్లగా తన దారి తాను చూసుకుంటున్నట్లు సమాచారం. బంగ్లాదేశ్ వరల్డ్ కప్ ఆడకపోతే, తాము కూడా బహిష్కరిస్తామని పాకిస్థాన్‌కు చెందిన కొన్ని మీడియా సంస్థలు గతంలో పేర్కొన్నాయి. తాజా నివేదిక ప్రకారం.. పాకిస్థాన్‌కు ప్రపంచకప్ బహిష్కరించే ఉద్దేశం లేదని తెలుస్తోంది. 'ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో భారత్ మొండిపట్టు వల్ల మా మ్యాచ్‌లు దుబాయ్‌కి మారాయి. ఆ సూత్రం ఆధారంగానే మేము బంగ్లాదేశ్‌కు మద్దతు ఇచ్చాం. కానీ వరల్డ్ కప్ ఆడకూడదనే ఆలోచన మాకు లేదు' అని పాక్ అధికారులు భావిస్తున్నట్లు సమాచారం.



## ఆంధ్ర అమ్మాయికి రజతం!

### ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌లో శుభారంభం

ఖేలో ఇండియా వింటర్ గేమ్స్ (కేఐడబ్ల్యూజీ) 2026లో తెలుగు తేజం జెస్సీ రాజ్ మాత్రాపు సిల్వర్ మెడల్‌తో మెరిసింది. లడఖ్‌లోని లేహ్ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో తొలిసారిగా ప్రవేశపెట్టిన 'ఫిగర్ స్కేటింగ్' విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 15 ఏళ్ల జెస్సీ రాజ్ మాత్రాపు రెండో స్థానంలో నిలిచి పతకం సాధించింది. జెస్సీ రాజ్ ప్రాథమికంగా రోలర్ స్కేటింగ్‌లో అంతర్జాతీయ గుర్తింపు పొందిన క్రీడాకారిణి. కేవలం కొన్ని వారాల క్రితమే ఐస్ స్కేటింగ్‌ను ప్రారంభించిన జెస్సీ, తన తొలి పోటీలోనే అద్భుత ప్రదర్శన కనబరిచి 'అడ్వాన్స్‌డ్ గర్ల్స్ షార్ట్ ప్రోగ్రామ్'లో రెండో స్థానంలో నిలిచింది.

## ఆర్సీబీని కొనేందుకు బిడ్ వేస్తా

ఐపీఎల్‌లో ఎంతో అభిమాన గణం ఉన్న ఫ్రాంఛైజీ, గత సీజన్ విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు త్వరలోనే చేతులు మారనుంది. ఆర్సీబీ యజమాని డియాజియో కంపెనీ ఇప్పటికే ఫ్రాంఛైజీ విక్రయ ప్రక్రియను మొదలుపెట్టింది. ఈ ఏడాది మార్చి 31 నాటికి ఈ ప్రక్రియ పూర్తికానున్నట్లు ఆ సంస్థ ఇప్పటికే ప్రకటించింది. ఇటీవల వచ్చిన నివేదికల ప్రకారం ఆర్సీబీ విలువ దాదాపు రెండు బిలియన్ డాలర్లుగా ఉంది. ఈ ఫ్రాంఛైజీని కొనుగోలు చేయడానికి భారత్‌తోపాటు కొన్ని విదేశీ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. తాజాగా సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈవో అదర్ పూనావాలా కూడా బెంగళూరు జట్టును దక్కించుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. 'ఐపీఎల్‌లోని అత్యుత్తమ జట్లలో ఒకటైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు' ఫ్రాంఛైజీ కొనుగోలు చేయడం కోసం రాబోయే కొద్ది నెలల్లో నేను బలమైన, పోటీతత్వమైన బిడ్‌ను వేస్తాను' అని అదర్ పూనావాలా గురువారం ఎక్స్‌లో పోస్టు పెట్టారు.



## సింధు@500

## పీవీ సింధు.. 500 విజయాలు

భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, ఒలింపిక్ పతకాల విజేత పూసర్ల వెంకట సింధు చరిత్ర సృష్టించింది. కెరీర్ లో 500 మ్యాచుల్లో విజయాలు సొంతం చేసుకుంది. ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా సింధు రికార్డు సృష్టించింది. అలానే ప్రపంచంలో ఆరో మహిళా షట్లర్‌గా చరిత్రకెక్కింది. తాజాగా ఇండోనేషియా మాస్టర్స్-2026 టోర్నమెంట్లో ఈ 500 విజయాల మైలు రాయిని అందుకుంది. ఇండోనేషియా మాస్టర్స్-2026 టోర్నీలో భాగంగా ప్రిక్వార్టర్ ఫైనల్లో డెన్మార్క్ షట్లర్ ఫో లినే హోజ్‌మార్క్ జేర్‌ఫీల్డ్‌ను 21-19, 21-18 తేడాతో ఓడించింది. నలభై మూడు నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో సింధు ఘన విజయం సాధించి.. క్వార్టర్ ఫైనల్‌కు దూసుకువెళ్లింది. ఇండోనేషియా మాస్టర్స్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లో సూపర్ విక్టరీ సాధించిన సింధు.. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నెం.4వ స్థానంలో ఉన్న చైనాకు చెందిన చెన్ యూ ఫీ రూపంలో గట్టి పోటీ ఎదుర్కోనుంది. వీరిద్దరు ఇప్పటి వరకు పదమూడు సార్లు ముఖాముఖి తలపడగా చెన్ 7, సింధు 6 సార్లు విజయం సాధించారు. చివరగా 2019లో చెన్‌ను సింధు ఓడించింది. తన తదుపరి మ్యాచులో చెన్ పై విజయం సాధించి.. తన రికార్డును మెరుగుపర్చుకోవాలని సింధు ఆసక్తిగా ఎదురు చూస్తోంది. మరోవైపు ఇదే టోర్నీలో లక్ష్య సేన్ సైతం క్వార్టర్ ఫైనల్‌కు చేరాడు. అరగంటకు పైగా సాగిన పోరులో హాంకాంగ్ షట్లర్ జేసన్ గునావన్‌పై 21-20, 21-11 తేడాతో గెలిచి లక్ష్య సేన్ ముందుడుగు వేశాడు.



## రింకూసింగ్ అద్భుతం

టీమిండియా ఫినిషర్ రింకూ సింగ్‌పై న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ సైమన్ డౌల్ ప్రశంసల జల్లు కురిపించాడు. ప్రపంచంలోని అత్యుత్తమ ఫినిషర్లలో రింకూ సింగ్ ఒకడని కొనియాడు. ఈపాటికే అతను భారత్ తరఫున 100 టీ20లు ఆడాల్సిందని అభిప్రాయపడ్డాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా నాగ్‌పూర్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో రింకూ సింగ్ చెలరేగాడు. తనకే సాధ్యమైన బ్యాటింగ్‌తో 44 పరుగులతో అజేయంగా నిలిచి భారత జట్టుకు అద్భుతమైన ముగింపు అందించాడు. రింకూ సింగ్ సూపర్ ఫినిష్‌తో 238 పరుగుల భారీ లక్ష్యాన్ని నమోదు చేసిన టీమిండియా 48 పరుగులతో న్యూజిలాండ్‌ను ఓడించింది. ఈ మ్యాచ్‌కు కామెంటేటర్‌గా వ్యవహరించిన సైమన్ డౌల్.. మ్యాచ్ అనంతరం రింకూ సింగ్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు. అతనికి తగిన అవకాశాలు రాలేదని అభిప్రాయపడ్డాడు. 'అత్యుత్తమ ఫినిషర్లలో రింకూ సింగ్ ఒకడు. ఐదేళ్ల క్రితమే ఐపీఎల్ ద్వారా అతను వెలుగులోకి వచ్చాడు. కానీ అతనికి భారత జట్టులో తగిన అవకాశాలు దక్కలేదు. అతను ఇంకా ఎక్కువ మ్యాచ్‌లు ఆడాల్సింది. ఈపాటికే అతను 100 మ్యాచ్‌ల మైలురాయి అందుకోవాల్సింది. ఫినిషర్‌గా రింకూ సింగ్ అవసరం టీమిండియాకు ఉంది. ఎందుకంటే ఫినిషర్‌గా ఆ బాధ్యతను అతను అద్భుతంగా నిర్వర్తించగలడు' అని అన్నాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
శుక్రవారం 23-1-2026



## అమెరికా ఫస్ట్ అసాధ్యం

డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు ప్రపంచ రాజకీయాల్లో పెను మార్పులకు సంకేతంగా మారుతున్నాయి. కేవలం తన దేశ ప్రయోజనాలే పరమావధిగా సాగే ట్రంప్ ఏకపక్ష ధోరణి ప్రపంచ శాంతికి, ఆర్థిక వ్యవస్థకు హాని కలిగించేలా మారుతున్నాయి. ట్రంప్ అనుసరిస్తున్న సుంకాల యుద్ధం ప్రపంచ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను దెబ్బతీసే అవకాశం ఉంది. ముఖ్యంగా చైనా, భారత్ వంటి దేశాల నుంచి వచ్చే వస్తువులపై భారీ పన్నులు విధిస్తామన్న హెచ్చరికలు ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితిని సృష్టిస్తున్నాయి. ఇది అంతర్జాతీయ సరఫరా గొలుసును విచ్ఛిన్నం చేసి, ద్రవ్యోల్బణానికి దారితీసే ప్రమాదం ఉంది. నాటో వంటి రక్షణ కూటముల పట్ల ట్రంప్ నిరాసక్తత, ఐరోపా దేశాల్లో వణుకు పుట్టిస్తోంది. అమెరికా తన మిత్రదేశాలకు అండగా ఉండదన్న సంకేతాలు వెలువడితే, అది రష్యా వంటి దేశాలకు మరింత బలాన్నిస్తుంది. ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలను నిర్వీర్యం చేయడం వల్ల ప్రపంచ వివాదాలను పరిష్కరించే యంత్రాంగం దెబ్బతింటుంది. అమెరికా ఒక శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశంగా ప్రపంచాన్ని నడిపించాల్సి ఉంది. అయితే, ట్రంప్ తన మొండి వైఖరితో సహకారాన్ని కాదని, ఘర్షణకు ప్రాధాన్యం ఇస్తే అది అమెరికాకే కాకుండా ప్రపంచానికీ చేటు చేస్తుంది. ప్రపంచీకరణ కాలంలో ఒక దేశం విడిగా ఎదగడం అసాధ్యం. ఇప్పటికైనా ట్రంప్ తన అతివాద ధోరణిని పక్కనపెట్టి, ప్రపంచ దేశాలతో కలిసి నడవాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో, ప్రపంచం మరో దశాబ్ద కాలం పాటు అనిశ్చితిలో కొట్టుమిట్టాడక తప్పదు.

**- ఈవార్తలు సంపాదకీయ విభాగం**

## నిరంతర చైతన్యం.. సుభాష్ చంద్ర బోస్

నేడు సుభాష్ చంద్రబోస్ జయంతి



భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో ధ్రువతారగా వెలిగిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్. జై హింద్ అనే నినాదంతో భారతీయుల రక్తంలో దేశభక్తిని నింపిన ఆ మహానేత జీవితం కేవలం గతం కాదు, అది భారత భవిష్యత్తుకు ఒక నిఘంటువు. నేటి 21వ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కొంటున్న యువతకు బోస్ జీవితం ఒక దిక్సూచిలా పనిచేస్తుంది. సుభాష్ చంద్రబోస్ చేసిన త్యాగం సామాన్యమైనది కాదు. అది అత్యున్నతమైన ఆత్మబలిదానం. ఆ రోజుల్లో భారతీయులకు అత్యున్నత గౌరవంగా భావించే ఐసీఎస్ పరీక్షలో నాలుగో ర్యాంకు సాధించారు. బ్రిటిష్ ప్రభుత్వంలో అత్యున్నత అధికారిగా విలాసవంతమైన జీవితం గడిపే అవకాశం ఉన్నప్పటికీ, బ్రిటిష్ వారి కింద పనిచేయడం కంటే నా దేశానికి సేవ చేయడం ముఖ్యం అని భావించి ఆ ఉద్యోగానికి రాజీనామా చేశారు.

స్వార్థం రాజ్యమేలుతున్న నేటి కాలంలో, సమాజం కోసం తన కెరీర్‌ను పణంగా పెట్టడం అనేది యువతకు ఒక గొప్ప పాఠం. దేశ విముక్తి కోసం బోస్ తన కుటుంబాన్ని, వ్యక్తిగత సుఖాలను తృణీకరించారు. విదేశాల్లో ఉంటూ, ప్రాణాలకు తెగించి ఆజాద్ హింద్ ఫౌజ్ నిర్మించడం కోసం ఆయన పడిన శ్రమ వర్ణనాతీతం. దశాబ్దాల పాటు గృహ నిర్బంధాలు, జైలు శిక్షలు అనుభవించినా ఆయన పట్టుదల సడలలేదు. తన పోరాట పంథాలో ఆయన ఎంచుకున్న మార్గం ముళ్లబాట. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించడానికి ప్రపంచ దేశాల మద్దతు కూడగట్టడంలో ఆయన చేసిన సాహస యాత్రలు, చివరికి తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా చేసిన పోరాటం భారత చరిత్రలో అజరామరం.



**వినోద్ కుమార్**

### భారత ప్రవాస ప్రధాని బోస్!

భారత తొలి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ ప్రమాణం చేయటానికి నాలుగేళ్ల ముందే నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆ పని చేశారు. 1943లో అక్టోబరు 21న నేతాజీ సారథ్యంలో సింగపూర్ వేదికగా భారత తాత్కాలిక ప్రభుత్వం కొలువుదీరింది. అప్పటికి ఆయన చేతిలో ఉన్న భారత భూభాగం.. అండమాన్ నికోబార్ దీవి మాత్రమే. రెండో ప్రపంచయుద్ధం చివరి రోజుల నాటికి భారత్ స్వాతంత్ర్య సమరం నాటకీయంగా మారసాగింది. జర్మనీ, జపాన్, బ్రిటన్‌ల మధ్య పోరు ప్రభావం భారత్‌పై పడుతున్న దశ అది. భారత్‌లో బ్రిటిష్‌వారి చెర నుంచి తప్పించుకుని వెళ్లిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జపాన్, జర్మనీల సహకారంతో సాయుధ మార్గంలో భారత్‌ను విముక్తం చేయాలని భావించారు. ఆ క్రమంలో ఆజాద్ హింద్ ఫౌజ్‌ను ఏర్పాటు చేశారు. బర్మా, సింగపూర్‌లాంటి చోట్ల ఓడిపోయి జపాన్ చేతికి చిక్కిన బ్రిటన్ సైన్యంలోని భారతీయ సిపాయిలు బోస్ సైన్యంలో చేరారు. వీరికి జపాన్, బర్మా, మలేసియా తదితర దేశాల్లోని భారతీయులు కూడా తోడయ్యారు. బలూచిస్థాన్ నుంచి మొదలుపెట్టి, దక్షిణభారతం దాకా అన్ని ప్రాంతాలవారితో సుమారు 50 వేల మందితో ఐఎన్‌ఏ ఓ భారత సమాహారంగా రూపుదిద్దుకుంది. ఝాన్సీ పేరిట ఏర్పాటైన రెజిమెంట్‌లో భారీసంఖ్యలో మహిళలు కూడా చేరటం విశేషం. సింగపూర్‌ను జపాన్ గెల్చుకోవటంతో బోస్ కార్యకలాపాలకు ఆ దేశం వేదికైంది. జపాన్ ప్రభుత్వ మద్దతుతో 1943 అక్టోబరు 21న నేతాజీ సింగపూర్ కాథీ థియేటర్‌లో ఆర్జి హుకూమత్ ఎ ఆజాద్ హింద్ (స్వతంత్ర భారత తాత్కాలిక ప్రభుత్వం)ను ఏర్పాటు చేశారు. బోస్ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయగా, లెఫ్టినెంట్ కర్నల్ ఏసీ ఛటర్జీ ఆర్థికమంత్రిగా, లక్ష్మీస్వామినాథన్ మహిళా వ్యవహారాల మంత్రిగా ప్రమాణం చేశారు. చరఖాతో కూడిన త్రివర్ణ పతాకాన్ని తమ పతాకంగా ప్రకటించారు. సబ్ సుఖ్ చయన్ (జనగణమనకు ఉర్దూ అనువాదం) జాతీయగీతంగా, జైహింద్‌ను నినాదంగా నిర్ణయించారు. తొలితరం విప్లవవాది రాస్ బిహారీ బోస్ ప్రభుత్వానికి సలహాదారుగా నియమితులయ్యారు. భారత్‌ను బ్రిటన్ నుంచి విముక్తం చేయటానికి విదేశీగడ్డపై ఏర్పడ్డ తాత్కాలిక ప్రభుత్వం అది. అండమాన్ నికోబార్ దీవులపై తప్పిస్తే భారత్‌లోని ఏ ప్రాంతంపైనా దీనికి అధికారం లేదు. అండమాన్ నికోబార్‌ను బ్రిటన్ నుంచి జపాన్ గెల్చుకొని, నేతాజీకి అప్పగించింది. పేరుకు నేతాజీ ప్రభుత్వమే అయినా పెత్తనమంతా జపాన్ సైన్యాలదే. ప్రభుత్వ ఏర్పాటు తరువాత నేతాజీ చలో ఢిల్లీ అంటూ పిలుపునిచ్చారు. భారత్‌లోని బ్రిటన్ ప్రభుత్వంపై ఇండో–బర్మా సరిహద్దుల్లో యుద్ధం ప్రకటించారు. ఇంఫాల్–కోహిమా సెక్టార్‌లో కూడా జపాన్ సేనలతో కలసి ఐఎన్‌ఏ పోరాడింది. కొన్ని విజయాలు, కొన్ని వెనకడుగులతో సాగిన ఐఎన్‌ఏ యాత్ర తన లక్ష్యాన్ని నేరుగా సాధించకున్నా.. పరోక్షంగా బ్రిటన్ ప్రభుత్వ గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది. తమ పక్షాన పోరాడుతున్న భారత సైనికులకు నమ్మలేని పరిస్థితి కల్పించింది. ఎక్కడ తిరుగుబాటు తలెత్తుతుందోననే ఆందోళన వారిలో రోజురోజుకూ ఎక్కువైంది. భారత్‌ను ఇక ఎక్కువరోజులు పాలించలేమనే భావన బ్రిటన్ మదిలో బలంగా నాటడంలో ఐఎన్‌ఏ సఫలమైంది.

### నేటి యువతకు నేతాజీ జీవిత పాఠాలు

నేటి ఆధునిక ప్రపంచంలో యువత అనేక గందరగోళాలకు లోనవుతున్నారు. ఇటువంటి సమయంలో బోస్ జీవితం నుండి మనం నేర్చుకోవాల్సిన అంశాలు అనేకం ఉన్నాయి. బోస్ జీవితం మనకు నేర్పే మొదటి పాఠం సంకల్పం. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాక, ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనకడుగు వేయకూడదు. 'మీరు నాకు రక్తాన్ని ఇవ్వండి, నేను మీకు స్వేచ్ఛను ఇస్తాను' అన్న ఆయన పిలుపులో ఉన్న దృఢత్వం నేటి యువత తమ వృత్తిపరమైన, వ్యక్తిగత లక్ష్యాల్లో ప్రదర్శించాలి. నేతాజీ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్‌లో కుల, మత, ప్రాంతీయ భేదాలు లేవు. అక్కడ అందరూ భారతీయులే. నేటి యువత కులమతాల రొంపిలో చిక్కుకోకుండా, భారతీయుడు అనే ఏకైక గుర్తింపుతో దేశాభివృద్ధికి తోడ్పడాలి. భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రాణప్రదంగా పాటించిన బోస్ మార్గం నేడు అత్యంత అవసరం. నాయకుడు అంటే కేవలం ఆదేశించేవాడు కాదు, ముందుండి నడిపేవాడు. బోస్ సైనికులతో కలిసి నడిచారు, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నారు. యువత తమ కెరీర్‌లో టీమ్ లీడర్లుగా ఎదిగేటప్పుడు బోస్ చూపిన మానవత్వం, సమయస్ఫూర్తిని అలవరుచుకోవాలి. బోస్ ఎప్పుడూ స్వశక్తిని నమ్ముకున్నారు. మన సమస్యలను మనమే పరిష్కరించుకోవాలని ఆకాంక్షించారు. నేటి స్టార్టప్ ప్రపంచంలో యువత సొంతంగా ఎదగడానికి, వినూత్న ఆలోచనలతో ప్రపంచాన్ని జయించడానికి బోస్ ఆలోచనా ధోరణి ఎంతో ఉపయోగపడుతుంది. ఆ రోజుల్లోనే ఝాన్సీ లక్ష్మీబాయి రెజిమెంట్ పేరుతో మహిళా సైన్యాన్ని ఏర్పాటు చేసిన ఘనత బోస్‌ది. మహిళా సాధికారత గురించి నేడు మనం మాట్లాడుకుంటున్నాం, కానీ బోస్ దానిని ఆచరణలో చూపారు. మహిళలను సమాన భాగస్వాములుగా చూడటం యువత ప్రాథమిక బాధ్యత. సుభాష్ చంద్రబోస్ కేవలం ఒక చారిత్రక పురుషుడు కాదు, ఆయన ఒక విప్లవాత్మక ఆలోచన. యువతలో నిద్రాణమై ఉన్న శక్తులను తట్టిలేపే నిరంతర చైతన్యం. విగ్రహాలకు పూలమాలలు వేయడం కంటే, ఆయన ఆశయాలను మన నిత్య జీవితంలో అన్వయించుకోవడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి. కష్టాలను చూసి భయపడకుండా, దేశ హితాన్ని కోరుతూ, అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం ప్రతి యువకుడిలో ఉంటే.. అది నేతాజీ కలలుగన్న నవభారతం అవుతుంది.

**జై హింద్!**

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.